# ప్రభాత సమాచారం

https: epaper.prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ ఆదివారం | 26 ఏప్రిల్ 2026 | ■ 12 పేజీలు




## ఆర్టీసీ సమ్మె విరమణతో సంబరాలు

■ ఏటా వానాకాలం వస్తే చాలు..

రైతుల గుండెల్లో రైళ్లు.. ■ సరిహద్దులే అడ్డాగా ..

■ యథేచ్ఛగా విత్తనాల అక్రమ రవాణా

■ చెలరేగిపోతున్న విత్తన మాఫియా

■ పంటలే కాదు..భూసారం కోల్పోతున్న రైతులు

■ ఉక్కుపాదం మోపితేనే అన్నదాతకు విముక్తి





# రైతు మెడకు 'నకిలీ' ఉచ్చు



జిల్లాలో గత కొన్నేళ్లుగా నాసిరకం విత్తనాల వ్యాపారం జోరుగా కొనసాగుతోంది. దాన్ని అరికట్టే చర్యలు లేని కారణంగా నాసిరకం విత్తన మాఫియా చెల రేగిపోతోంది. దీంతో రైతులు వారు చెప్పే మాటలు నమ్మి నిలువునా మోసపోతున్నారు. రైతుల అమా యకత్వాన్ని ఆసరా చేసుకొన్న సీడ్ మాఫియా వారికి నాసిరకం విత్తనాలు అంటగట్టి లక్షలు గడిస్తున్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకు న్నారన్న చందంగా విత్తన మాఫియాపై అధికారులు చర్యలు చేపడుతున్నా కేవలం దాడులకే పరిమితమవుతున్నారన్న ఆరోపణలున్నాయి.



### పారిశుధ్య నిర్వహణ

## పకడ్బందీగా చేపట్టాలి

దోమల ద్వారా వ్యాప్తి చెందే మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి వ్యాధులను నిరోధించేందుకు దోమల వృద్ధిని అరికట్టాలని, ఇందు కొరకు ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని మందమర్రి మండలం ఊరు మందమర్రిలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన శిబిరానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. అనిత, ప్రోగ్రాం అధికారు లు డా. సుధాకర్ నాయక్, డా. ప్రసాద్ లతో కలిసి హాజ రై కార్యక్రమ సంబంధిత గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వ్యాధులకు చికిత్స అందుబాటులో ఉన్నప్పటికీ ముందస్తు జాగ్రత్తలు పాటించడం ద్వారా వ్యాధులను పూర్తిగా నిరోధించవచ్చని తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికా కార్యాచరణలో పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు.

### నిర్మల్ జిల్లా కలెక్టర్‌గా

## భవేష్ మిశ్రా

### ఇంటర్ బోర్డు డైరెక్టర్‌గా అభిలాష అభినవ్ బదిలీ

నిర్మల్ జిల్లా కలెక్టర్‌గా భవేష్ మిశ్రా నియమితులయ్యారు. గతంలో కలెక్టర్‌గా పనిచేసిన అభిలాష అభినవ్ ఇంటర్మీడియట్ బోర్డు సెక్రటరీగా బదిలీ అయ్యారు. 2015 బ్యాచ్‌కు చెందిన భవేష్ మిశ్రా ప్రస్తుతం పరిశ్రమలు ఐటీ, ఈడీసీ విభాగంలో స్పెషల్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్నారు. జూన్ 16, 2024న బాధ్యతలు చేపట్టిన అభిలాష అభినవ్, నిర్మల్‌లో సంవత్సరం తొమ్మిది నెలలు కలెక్టర్‌గా పనిచేశారు.



# సైబర్ మాయాజాలం



- సాంతికకతో 74 అనుమానాస్పద మ్యూల్ అకౌంట్ల గుర్తింపు
- రూ.7కోట్లుకు పై మోసం వెలుగులోకి
- బ్యాకు ఖాతాల వివరాలు ఇస్తే కటకటాలకే..
- ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్
- ప్రజలు అప్రమత్తంగా ఉండాల ఎస్పీ సూచన

**ఆదిలాబాద్ జిల్లాలో పోలీసులు చేపట్టిన ఆపరేషన్ క్రాక్‌డౌన్-1.0లో భారీ సైబర్ మోసాలు వెలుగులోకి వచ్చాయి. జిల్లా వ్యాప్తంగా 74 అనుమానాస్పద మ్యూల్ అకౌంట్లను గుర్తించి,12 ప్రధాన కేసులు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు.** ఈ మోసాల ద్వారా మొత్తం రూ.7,01,83,214 అక్రమ లావాదేవీలు జరిగినట్లు వెల్లడించారు. గేమింగ్ యాప్స్, ఆన్‌లైన్ బెట్టింగ్, ఫేక్ ట్రేడింగ్, టాస్క్/రివ్యూ మోసాల ద్వారా డబ్బు మార్పిడి జరిగినట్లు విచారణలో బయటపడింది. ఈ కేసుల్లో షెర్లా రాజవర్ధన్, పేట్లశ్రీ అక్షయ్, రాజేందర్, షేక్ సమీర్‌లను రిమాండ్‌కు పంపగా, మరికొంత మందిని నిందితులుగా గుర్తించారు. దేశవ్యాప్తంగా నమోదైన చీజ=్రా ఫిర్యాదులతో ఈ అకౌంట్లు అనుసంధానమై ఉన్నట్లు పోలీసులు తెలిపారు.ప్రజలు తమ బ్యాంకు ఖాతాలు, OTP, PIN వివరాలు ఇతరులకు ఇవ్వవద్దని హెచ్చరించారు.



### దోమల వృద్ధి అరికట్టేందుకు

# పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**





**మందమర్రి, ఏప్రిల్ 25 (ప్రభాత సమాచారం):** దోమల ద్వారా వ్యాప్తి చెందే మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి వ్యాధులను నిరోధించేందుకు దోమల వృద్ధిని అరికట్టాలని, ఇందు కొరకు ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని మందమర్రి మండలం ఊరు మందమర్రిలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన శిబిరానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. అనిత, ప్రోగ్రాం అధికారులు డా. సుధాకర్ నాయక్, డా. ప్రసాద్ లతో కలిసి హాజరై కార్యక్రమ సంబంధిత గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వ్యాధులకు చికిత్స అందుబాటులో ఉన్నప్పటికీ ముందస్తు జాగ్రత్తలు పాటించడం ద్వారా వ్యాధులను పూర్తిగా నిరోధించవచ్చని తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికా కార్యాచరణలో భాగంగా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని, వర్షాకాలంలో మురుగు కాలువలలో నీరు నిల్వ ఉండకుండా ప్రవహించేలా చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. దోమల అభివృద్ధిని అరికట్టేందుకు బ్లీచింగ్ పిచికారి, ఆయిల్ బాల్స్, స్ప్రే కార్యక్రమాలు చేపట్టాలని, ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలని, డ్రై డే కార్యక్రమాలలో పాల్గొనేలా ప్రజలను ప్రోత్సహించాలని తెలిపారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో వ్యాధులను నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలని, గ్రామపంచాయతీ, మున్సిపాలిటీలలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. గ్రామీణ గిరిజన ప్రాంతాలలో ప్రభావిత ప్రాంతాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించాలని, ఇంటి పరిసరాలలో నీరు నిలువ ఉండే ప్రదేశాలను గుర్తించి వాటిని తొలగించాలని, వీధులన్నీ శుభ్రంగా ఉంచాలని, మురుగు కాలువలలో చెత్తాచెదారం తొలగించాలని తెలిపారు. మలేరియా పరీక్ష కొరకు ఆరోగ్య కార్యకర్తల దగ్గర ఉచిత రక్త పరీక్ష కిట్ల ద్వారా చర్యలు చేపట్టి, ఉచిత మందుల సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. వేసవిలో ఉష్ణోగ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు సమయపాలన పాటిస్తూ తగు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని, వడదెబ్బకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అనంతరం కీటక జనిత వ్యాధుల నియంత్రణ కొరకు పని చేసి ఉత్తమ సేవలు అందించిన వైద్యులు, వైద్య సిబ్బందికి జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, సిహెచ్ఓలు కాకిరాల వెంకటేశ్వర్లు, నామ్ దేవ్, అల్లాడి శ్రీనివాస్, వైద్యాధికారులు, వైద్యులు, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# సామాజిక సందేశంతో 'డోస్' షార్ట్ ఫిల్మ్ విడుదల




**పోస్టర్ ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**

**ఆదిలాబాద్, ఏప్రిల్ 25 (ప్రభాత సమాచారం):** సామాజిక అవగాహనకు దోహదపడే ఉద్దేశంతో రూపొందించిన 'డోస్' అనే షార్ట్ ఫిల్మ్ పోస్టర్ ను ఈరోజు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ గారు ఘనంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో ఉన్న సమస్యలను సృజనాత్మకంగా ప్రజలకు చేరవేసే సాధనంగా షార్ట్ ఫిల్మ్స్ కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత ఇలాంటి ప్రయోగాలు చేయడం అభినందనీయమని తెలిపారు. ఈ చిత్ర నిర్మాణానికి ప్రారంభం నుంచే సహకారం అందించిన షీ టీమ్ సభ్యులను ఎస్పీ ప్రత్యేకంగా ప్రశంసించారు. పోలీస్ శాఖ చేసే అవగాహన కార్యక్రమాలు మరింత ఫలవంతంగా, ప్రజలకు చేరువగా ఉంటాయని అన్నారు. చిన్న స్థాయిలో నిర్మితమైనప్పటికీ, 'డోస్' షార్ట్ ఫిల్మ్ బలమైన సామాజిక సందేశాన్ని కలిగి ఉందని దర్శక బృందాన్ని అభినందించారు. ఈ చిత్రం ప్రేక్షకులను ఆలోచింపజేస్తూ, సమాజంలో సానుకూల మార్పుకు దారితీస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివారం ఉదయం 9 గంటలకు ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రజలందరూ ఈ షార్ట్ ఫిల్మ్‌ను వీక్షించి, తమ అభిప్రాయాలను తెలియజేయాలని చిత్ర బృందం కోరింది. అర్జున్ లింగాల, క్లిక్స్ ఆఫ్ రవి, లింగాల సిద్ధార్థ, పసుపుల దేవిదాస్, సంతోష్, లోకేష్, లోకల్ చంటి, తేజస్విని, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# వేసవి శిబిరాలతో విద్యార్థినుల్లో నైపుణ్యాల వెలికితీత






**ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా**

**ఆదిలాబాద్, ఏప్రిల్ 25 (ప్రభాత సమాచారం):** విద్యార్థినుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు వేసవి శిక్షణ శిబిరాలు చక్కని వేదికలనీ జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక న్యూ హౌసింగ్ బోర్డ్ కాలనీలోని ఎం.జె.పి బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలలో తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ నివాస విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల విద్యార్థినుల కోసం 15 రోజుల పాటు ఏర్పాటు చేసిన 'ఆర్ట్ & స్పోర్ట్స్ సమ్మర్ క్యాంప్-2026' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు క్రీడలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థినుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇటువంటి వేసవి శిబిరాలు చక్కని వేదికలన్నారు. స్వయం ఆసక్తితో ఈ శిబిరానికి హాజరైన సుమారు 400 మంది విద్యార్థినులను అభినందించారు. చదువుతో పాటు స్పోకెన్ ఇంగ్లీష్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, యోగా, వేద గణితం, వ్యక్తిత్వ వికాసం, క్రీడలలో శిక్షణ పొందడం ద్వారా ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఎం.జె.పి పాఠశాలలు సాధించిన ఉత్తమ ఫలితాలను ప్రశంసించారు. ముఖ్యంగా ఆదిలాబాద్ జిల్లా టాపర్‌గా నిలిచిన విద్యార్థినిని ఉదాహరణగా చూపుతూ, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ శిబిరంలో విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పౌష్టికాహారం, ఇతర వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలో అవసరమైన అత్యవసర మరమ్మతు పనులకు నిధులు మంజూరు చేస్తామని, వచ్చే విద్యా సంవత్సరం నాటికి పనులు పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అర్సిఒ శ్రీధర్, డిపిఎం శోభారాణి, ప్రిన్సిపాల్ కీర్తి, డిఈ సమ్మీ రెడ్డి, సంబంధిత పాఠశాలల ప్రిన్సిపాల్ లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఈ నెల 27న ప్రజావాణి రద్దు

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, ఏప్రిల్ 25 (ప్రభాత సమాచారం):** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించిన గృహ నిర్మాణ, రెవెన్యూ శాఖల సమస్యలపై ప్రభుత్వం ఈ నెల 27వ తేదీన హైదరాబాద్ లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినందున 27వ తేదీన రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ప్రకటనలో తెలిపారు. ప్రజలు, దరఖాస్తుదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని, మే 4వ తేదీ సోమవారం నుంచి ప్రజావాణి కార్యక్రమం యధావిధిగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

## కవ్వాల్‌లో పిచ్చి కుక్క స్వైరవిహారం

**జన్నారం, ఏప్రిల్ 25 (ప్రభాత సమాచారం):** మండలంలోని కవ్వాల్ గ్రామంలో శనివారం ఉదయం నుంచి ఒక పిచ్చి కుక్క స్వైర విహారం చేస్తుంది. ఇప్పటికే ఒక చిన్న ఆవు దూడతో పాటు సుమారు ఐదు ఆవుల పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులంతా అప్రమత్తంగా ఉండాలని గ్రామ పెద్దలు హెచ్చరిక జారీ చేశారు. ముఖ్యంగా చిన్న పిల్లలను ఒంటరిగా బయటకు పంపవద్దని సూచించారు. వీధుల్లో తిరిగేటప్పుడు, పొలం పనులకు వెళ్ళేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలని కోరారు. ఈ విషయాన్ని గ్రామంలోని అందరికీ తెలియజేసి, గ్రామస్తుల మరియు పశువుల రక్షణ కోసం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పిచ్చి కుక్క కనిపిస్తే వెంటనే గ్రామ పంచాయతీ లేదా సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.



## పాఠశాలను వెంటనే తెరువకపోతే ఉద్యమిస్తాం

**టిఆర్ఎస్ నాయకులు మినహాజ్.**

**నిర్మల్ 25 (ప్రభాత సమాచారం):** నిర్మల్ పట్టణ పంజేషా ఉర్దూ పాఠశాలను తక్షణమే పునః ప్రారంభించాలని నిర్మల్ పట్టణ బిఆర్ఎస్ నాయకులు మొహమ్మద్ మినహాజ్ డిమాండ్ చేశారు. 20 మంది నిరుపేద విద్యార్థులతో కొనసాగుతున్న ఆ పాఠశాలను మాజీ మండల విద్యాధికారి అక్రమంగా మూసివేసి రాత్రికి రాత్రే డ్రాప్ బాక్స్ లో వేయడం సహించరాని విషయమని అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి పాఠశాల మూసివేసిన వ్యవహారం వచ్చినప్పటికి స్పందించకపోవడం పట్ల ఆయన అసహనం వ్యక్తం చేశారు. 20 మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడిన ఆ అధికారిపై చర్యలు తీసుకొని ,వెంటనే ఆ పాఠశాలను తెరువకపోతే ఉద్యమించాల్సి వస్తుందని మినహాజ్ హెచ్చరించారు.

## విత్తన, ఎరువుల దుకాణాల్లో ముమ్మర తనిఖీలకు ఆదేశం

**ఆదిలాబాద్, ఏప్రిల్ 25 (ప్రభాత సమాచారం):** రానున్న వానకాలం సాగు సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్ నుండి మండల వ్యవసాయ అధికారులకు గూగుల్ మీట్ నిర్వహించి సాగు సన్నద్ధత, ఎరువుల నిల్వలు, ఇతర అంశాలపై కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యంగా విత్తనాలు, ఎరువుల లభ్యతలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని అధికారులను హెచ్చరించారు. జిల్లాలో నకిలీ విత్తనాలు, ఎరువుల విక్రయాలను అరికట్టేందుకు తక్షణమే ప్రత్యేక తనిఖీ బృందాలను (స్క్వాడ్స్) ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి మండలంలో వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో డీలర్ దుకాణాలను నిశితంగా పరిశీలించాలని, స్టాక్ రిజిస్టర్లను నిల్వలతో సరిపోల్చాలని సూచించారు. ఎవరైనా అక్రమాలకు పాల్పడితే డీలర్ల లైసెన్సులు రద్దు చేయడమే కాకుండా, వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువుల విక్రయాలను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రైతులకు ఎరువుల కొరత రాకుండా చూడటంతో పాటు, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయాలు జరిగేలా పర్యవేక్షించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు రైతులకు సకాలంలో అందాలంటే 'ఫార్మర్ రిజిస్ట్రేషన్' ప్రక్రియ అత్యంత కీలకమని తెలిపారు. ఈ నెల ఆఖరు నాటికి జిల్లాలోని ప్రతి రైతు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వంద శాతం రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని గడువు విధించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు గ్రామాల్లో పర్యటించి డేటా సేకరణను వేగవంతం చేయాలని ఆదేశించారు.

# దేవాపూర్ గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం

**62 ద్విచక్ర వాహనాల తనిఖీ,**
**10 ద్విచక్ర వాహనాలు, ఒక కార్ స్వాధీనం...**
**రూ 50 వేల విలువైన కలప స్వాధీనం**
**62 లీటర్ల మద్యం స్వాధీనం, ఎక్సైజ్ కేసుల నమోదు.**
**అసాంఘిక కార్యకలాపాలు చేసిన వారిపై చర్యలు**
**ప్రజల భద్రతకై కమ్యూనిటీ కాంటాక్ట్‌ల నిర్వహణ**
**100మంది సిబ్బందితో 9 వరకు తనిఖీలు.**
**అదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి**



**ఆదిలాబాద్, ఏప్రిల్ 25 (ప్రభాత సమాచారం):** ప్రజల రక్షణ, సంరక్షణ సక్రమంగా నిర్వహించడానికి కమ్యూనిటీ కాంటాక్ట్ (కార్డెన్ అండ్ సెర్చ్)లను నిర్వహించడం జరుగుతుందని ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి తెలిపారు. తలమడుగు మండలంలోని దేవాపూర్ గ్రామంలో ఉదయం ఐదు గంటల నుండి 9 గంటల వరకు 100 మంది సిబ్బందితో కమ్యూనిటీ కాంటాక్ట్ ను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో 62 ద్విచక్ర వాహనాలు తనిఖీ చేయగా, సరైన ధ్రువపత్రాలు లేనటువంటి 10 ద్విచక్ర వాహనాలను, ఒక కారు ను స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్నటువంటి 15వేల రూపాయల చలాన్లను ప్రజలు చెల్లించడం జరిగింది. ఈ సందర్భంగా డీఎస్పీ ప్రజలతో మాట్లాడుతూ రోడ్డు భద్రత "అరైవ్ అలైవ్" లో భాగంగా రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ వాహనాలను నడపాలని సూచించారు. ప్రజలు యువత వాహనాలలో ప్రయాణించేటప్పుడు హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు. అదేవిధంగా గంజాయి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని తెలిపారు. అక్రమంగా కలప నిలువ ఉంచిన ఒక కేసు నమోదు చేయడం జరిగిందని, దాదాపు 50 వేల రూపాయల విలువైన కలప స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించకుండా ఉండాలని సూచించారు. ముఖ్యంగా సీసీటీవీ కెమెరాల ప్రాధాన్యతను తెలియజేస్తూ వాటి ఏర్పాటుకు కృషి చేయాలని తెలిపారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించి సోషల్ మీడియా పట్ల అప్రమత్తతతో వ్యవహరించాలని తెలిపారు. శిక్షణ ఐపీఎస్ మావల ఎస్ హెచ్ ఓ రాహుల్ కాంత్, ఏఆర్ డీఎస్పీ కమతం ఇంద్రవర్ధన్, రూరల్ సీఐ కె ఫణిదర్, ఇచ్చోడ రూరల్ సీఐ సిహెచ్ రమేష్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ ఇన్ చంద్రశేఖర్, తలమడుగు ఎస్ఐ రాధిక, రూరల్ ఎస్సై విష్ణువర్ధన్, ఎస్సైలు మనీష్, విష్ణు ప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణలో మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, ఏప్రిల్ 25 (ప్రభాత సమాచారం):** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జబితా సవరణలో మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాములు, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, ప్రత్యేక ఉప పాలనాధికారి చంద్రకళ లతో కలిసి అన్ని మండలాల తహసిల్దార్లు, ఎన్నికల విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో మ్యాపింగ్ శాతాన్ని పెంపొందించడం అత్యవసరమని తెలిపారు. జిల్లా, మండల స్థాయి అధికారులు తమ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులు (రెగ్యులర్, ఒప్పంద, పొరుగు సేవలు, దినసరి, ఇతరులు), వారి కుటుంబ సభ్యులు తాము నమోదు చేయబడిన పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన బూత్ స్థాయి అధికారులను సంప్రదించి 2002 ఓటర్ల జాబితాలో ఎన్నికల మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఫారం 6, 7, 8 ద్వారా అందిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి త్వరగా పరిష్కరించాలని, మరణించిన, ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్ల వివరాలను గుర్తించి ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి పరిశీలించి వివరాలను ధ్రువీకరించి తొలగించాలని/ సవరించాలని తెలిపారు. ఒకే నియోజకవర్గంలో చిరునామా మార్చుకున్న ఓటర్లకు నోటీసులు జారీ చేసి సరైన చిరునామాలో ఓటు నమోదు చేయాలని, ఇతర నియోజకవర్గాలు మారిన ఓటర్లను ప్రస్తుత జాబితా నుండి తొలగించాలని తెలిపారు. జిల్లాలో డబుల్ ఓటర్లను గుర్తించి తొలగించాలని, ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం పై ప్రజలలో అవగాహన కల్పించేందుకు దినపత్రికలు, స్థానిక ఛానల్లలో స్క్రోలింగ్ నిర్వహించాలని తెలిపారు. మున్సిపల్, గ్రామీణ ప్రాంతాలలో చెత్త సేకరణకు ఉపయోగించే వాహనాల ద్వారా టామ్ టామ్ ప్రచారం నిర్వహించి ఓటర్లను చైతన్యపరచాలని తెలిపారు. జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో కృషిచేసి విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా నిర్వహించేందుకు కీలక మార్పులు

**మంచిర్యాల, ఏప్రిల్ 25 (ప్రభాత సమాచారం):** యాసంగి 2025-26 సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు ప్రక్రియ మరింత వేగవంతంగా, సమర్ధవంతంగా నిర్వహించేందుకు సాఫ్ట్ వేర్ లో ప్రభుత్వం కీలక మార్పులు చేసిందని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాములు ఒక ప్రకటనలో తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు సమీపంలో ఉన్న రైస్ మిల్లులకు ధాన్యం తరలించడం జరుగుతుందని, ప్రతి రైస్ మిల్లు సామర్థ్యాన్ని పరిగణలోకి తీసుకొని తదనుగుణంగా ధాన్యం కేటాయించేలా ఆధునీకరించడం జరిగిందని, ఈ మార్పుతో రవాణా సమయం, కొనుగోలు ప్రక్రియ వేగవంతమవుతుందని తెలిపారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం వేసిన తర్వాత గతంలో మాదిరిగా మాన్యువల్ ట్రక్ షీట్ ఉండదని, ఆన్ లైన్ లో మాత్రమే ట్రక్ షీట్ జనరేట్ చేయబడుతుందని, కొనుగోలు కేంద్రం, మిల్లుల టాకింగ్ ఆటోమేటిక్ గా అవుతుందని, ఆన్లైన్ లో జనరేట్ అయిన ట్రక్ షీట్ ను కొనుగోలు కేంద్రాల వారు ప్రింట్ తీసి ధాన్యపు లారీ వెంబడి మిల్లుకు పంపించాలని, ధాన్యం లారీ పక్కదారి పట్టకుండా జిపిఎస్ పరికరం బిగించబడి ఉంటుందని తెలిపారు. రైతు వివరాలను సిస్టం లో నమోదు చేసి ఆధార్ కార్డు ద్వారా వారి గుర్తింపును ధృవీకరించాలని, రైతు భూమి విస్తీర్ణం, పండించిన ధాన్యం వివరాలను సరి చూడాలని, ధాన్యం నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండే విధంగా పరిశీలించాలని, నాణ్యత అయితేనే రైతులకు గోనె సంచులు అందించాలని తెలిపారు. సంచులలో ధాన్యం నింపి కేంద్రం వద్ద తప్పనిసరిగా తూకం వేయాలన్నారు.



## పోలీసుల ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు సమ్మర్ క్యాంప్

**పోలీసులు మీకోసంలో సమ్మర్ క్యాంప్ ఏర్పాటు.**

**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**

**ఆదిలాబాద్, ఏప్రిల్ 25 (ప్రభాత సమాచారం):** పాఠశాలలో చదువుతున్న రెండవ తరగతి నుండి పదవ తరగతి వరకు విద్యార్థిని విద్యార్థులకు పోలీసులు మీకోసం లో భాగంగా జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో ఉచితంగా సమ్మర్ క్యాంప్ నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ ఒక పత్రిక ప్రకటన ద్వారా తెలియజేశారు. ఆదిలాబాద్ జిల్లాలోని పోలీసుల ఆధ్వర్యంలో మొట్టమొదటిసారిగా ప్రారంభమైన ఈ సమ్మర్ క్యాంపు నిర్వహణ రెండవ సంవత్సరం లో సైతం కొనసాగుతుంది. పాఠశాల విద్యార్థులకు ఉదయం 6 గంటల నుండి 7 గంటల వరకు పోలీసు ఏఆర్ హెడ్ క్వార్టర్స్ అదిలాబాద్ మరియు ఇచ్చోడ, ఇంద్రవెల్లి, నార్నూర్, బోథ్ పోలీస్ స్టేషన్లో ఏక కాలంగా మే 4 నుండి 30 వరకు సమ్మర్ క్యాంప్ ఉచితంగా నిర్వహించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. కనీసంగా రెండవ తరగతి నుండి పదవ తరగతి వరకు వరకు చదువుతున్న విద్యార్థులు ఈ సమ్మర్ క్యాంపులో పాల్గొనవలసిందిగా తెలియజేశారు. పాల్గొనవలసిన విద్యార్థిని విద్యార్థులు దగ్గర్లో ఉన్న పోలీస్ స్టేషన్లో ఈనెల 30వ తేదీ లోపు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందిగా తెలిపారు. ఈ సమ్మర్ క్యాంపు నందు పోలీసులు విద్యార్థినీ విద్యార్థులకు కరాటే, యోగ, పిఈటి, వాలీబాల్, కబడ్డీ తో పాటుగా ఈ సంవత్సరం నూతనంగా టేబుల్ టెన్నిస్ ఆర్చరీ లాంటి క్రీడాంశాలలో శిక్షణను అందించనున్నట్లు తెలిపారు. ఉత్సాహం ఉన్న విద్యార్థిని విద్యార్థులు పాల్గొనవలసిందిగా సూచించారు. 5 ప్రాంతాలలో నోడల్ అధికారిగా రిజర్వ్ ఇన్స్పెక్టర్ డి వెంకటి-(8712659961) ఉండనున్నారని తెలిపారు.

# చిన్నారులు, గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్






**మంచిర్యాల, ఏప్రిల్ 25 (ప్రభాత సమాచారం):** చిన్నారులు, గర్భిణుల ఆరోగ్యకరమైన భవిష్యత్తుపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ్ పక్వాడ 8వ విడత కార్యక్రమానికి జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.అనితలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పోషణ్ పక్వాడ 8వ విడత కార్యక్రమం ఈనెల 9 తేదీ నుండి 23వ తేదీ వరకు నిర్వహించడం జరిగిందని తెలిపారు. పిల్లలలో మొదటి 6 సంవత్సరాల కాలంలో మెదడు అభివృద్ధి గరిష్టంగా ఉంటుందని, ఈ విషయం ప్రధాన అంశంగా పరిగణలోకి తీసుకుని ప్రత్యేక దృష్టి సాధించడం జరిగిందని తెలిపారు. చిన్నారుల సమగ్ర అభివృద్ధికి పోషకాహారం అత్యవసరమని, గర్భిణి స్త్రీలు, చిన్నపిల్లలకు సరైన ఆహారం అందించడం ద్వారా ఆరోగ్యకరమైన భవిష్యత్తు నిర్మించవచ్చని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాలని తెలిపారు. గర్భిణులు, బాలల పోషకాహారం పై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, తొలి వేయి రోజులలో సరైన పోషణ, శిశు అభివృద్ధిపై దృష్టి సారించాలని, అంగన్వాడి కేంద్రాల ద్వారా ఆటల ఆధారిత విద్యను ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. పోషణ పంచాయతీలు, సామాజిక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, పిల్లలలో స్క్రీన్ టైమ్ తగ్గించే దిశగా తల్లిదండ్రులకు మార్గదర్శకాలు అందించాలని తెలిపారు. నలుగురు గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం, బాలలకు అక్షరాభ్యాసం, గ్రాడ్యుయేషన్ ధ్రువపత్రాల అందజేత కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా స్థానిక సమాజం, తల్లులు, సంరక్షకులను భాగస్వామ్యం చేస్తూ పోషకాహారం పై విస్తృత ప్రచారం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

**మంచిర్యాల, ఏప్రిల్ 25 (ప్రభాత సమాచారం):** మంచిర్యాల జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని తెలంగాణ జలసాధన సమితి కన్వీనర్ నైనాల గోవర్దన్ అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో రైతు సమస్యలపై జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ రాములుకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంచిర్యాల జిల్లాలో వరి కోతలు కోసి 20 రోజులు అవుతుందన్నారు. ప్రతిరోజు రైతులు వరి ధాన్యాన్ని ఆరబోస్తున్నారని తెలిపారు. సాయంత్రం సమయాల్లో వర్షం వస్తుందని ఆరబోసిన వరి ధాన్యాన్ని మళ్లీ కుప్పలుగా చేస్తున్నారని వివరించారు. దీంతో రైతులకు వరి ధాన్యం కుప్పల వద్ద పడిగాపులు ఉండాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. యుద్ధ ప్రాతిపదికన మిల్లులకు వరి ధాన్యాన్ని కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం పంటలు నష్టపోయి ఆత్మహత్యకు పాల్పడుతున్న రైతు సమస్యలను పరిష్కరించడంలో విఫలమవుతుందన్నారు. ఈ రబీ సీజన్లో వరి పంట పైన పెద్ద మొత్తంలో ఖర్చు పెట్టిన రైతన్నలకు కష్టాలు తప్పడం లేదన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసే విధంగా రైతులకు తోడ్పాటు అందించాలని కోరారు.

## వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 25 (ప్రభాత సమాచారం):** ఉమ్మడి జిల్లా గిరిజన క్రీడాకారులు వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కె హరిత అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో శనివారం ఉమ్మడి జిల్లా గిరిజన విద్యార్థులకు ఏర్పాటు చేసిన వేసవి క్రీడల శిక్షణ శిబిరాన్ని గిరిజన జిల్లా సంక్షేమాధికారిణి రమాదేవితో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా గిరిజన విద్యార్థుల కోసం వేసవి క్రీడల శిక్షణలో భాగంగా హ్యాండ్‌బాల్, కబడ్డీ, అథ్లెటిక్స్‌పై శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు. విద్యార్థులు ఈ శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణలో మెలకువలు నేర్చుకొని క్రీడల్లో రాణించాలన్నారు. యువత చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. వ్యసనాల బారిన పడకుండా లక్ష్యం చేరుకునేందుకు కష్ట పడాలని తెలిపారు. క్రీడాకారులకు క్రీడ దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో గిరిజన క్రీడల అధికారి మడావి శేకు, జీసీడీవో శకుంతల, ఎంసీవో ఉద్ధవ్, హెచ్ఎం సాయిబాబా, పీడీ, పీఈటీలు పాల్గొన్నారు.

## అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల జారీ

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 25 (ప్రభాత సమాచారం):** జిల్లాలో 252 జీవో ప్రకారం అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు అందజేస్తామని కలెక్టర్ హరిత అన్నారు. కలెక్టరేట్ లో శనివారం జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశానికి కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. 2026 సంవత్సరానికి గాను కమిటీ ఆధ్వర్యంలో మొదటి విడతలో 94 నూతన అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయనున్నామని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారు 252 జీవోలో పేర్కొన్న అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించాలని సూచించారు. అక్రిడిటేషన్ సభ్యులు రహెమాన్, రవినాయక్, తుకారాం, సంతోష్, ప్రకాష్‌గౌడ్, చందు, అలీద్ అహ్మద్, వినయ్‌కుమార్, రాజు, అవినాష్ పాల్గొన్నారు.





## అధిక లాభాల ఆశచూపి కోట్ల దోపిడీ

**కాగజ్‌నగర్, ఏప్రిల్ 25 (ప్రభాత సమాచారం):** సామాన్యుల ఆశలను పెట్టుబడిగా మార్చుకుని, అధిక లాభాల పేరుతో కోట్ల రూపాయలకు కుచ్చుటోపీ పెట్టిన డివైన్ గ్రూప్ ఆఫ్ కంపెనీ మోసం కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. ఈ అంతర్ జిల్లా మోసగాళ్ల ముఠాలో కీలక సభ్యురాలైన ఠాకూర్ శివరంజని బాయిని కాగజ్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ నితిక పంత్ కేసు వివరాలు మీడియాకు వెల్లడించారు. సికింద్రాబాద్‌కు చెందిన ఠాకూర్ కరణ్ సింగ్ తన కుటుంబ సభ్యులతో కలిసి డివైన్ గ్రూప్ ఆఫ్ కంపెనీ పేరిట నకిలీ సంస్థను స్థాపించాడు. 2021 నుంచి 2023 వరకు కాగజ్‌నగర్ పట్టణంలో నివాసం ఉంటూ స్థానికులను బుట్టలో వేసుకున్నారు. తమ కంపెనీలో పెట్టుబడి పెడితే నెలకు 5% నుంచి 20% వరకు భారీ లాభాలు అందిస్తామని నమ్మబలికారు. వీరి మాటలు నమ్మి కాగజ్‌నగర్, పెంచికల్‌పేట్ పరిసర ప్రాంతాల ప్రజలు లక్షలాది రూపాయలు పెట్టుబడిగా పెట్టారు. వసూళ్లు పూర్తయ్యాక నిందితులు రాత్రికి రాత్రే బోర్డు తిప్పేసి పరారయ్యారు. నిందితులపై ఇప్పటివరకు నమోదైన కేసుల వివరాలు దిగ్భ్రాంతి కలిగిస్తున్నాయి కేవలం కొమరం భీమ్ జిల్లాలోనే కాగజ్‌నగర్ టౌన్ లో 1.08 కోట్లు, పెంచికల్‌పేట్ రూ. 10 లక్షల రూపాయలు, సికింద్రాబాద్ లాలాగూడలో 31 లక్షలు, జుజా పరిధిలో రూ. 1.25 కోట్ల భారీ మోసానికి పాల్పడినట్లు తెలిపారు. తమపై కేసులు నమోదు కావడంతో నిందితులు సికింద్రాబాద్‌లోని తమ నివాసానికి మకాం మార్చారు. పక్కా సమాచారంతో కాగజ్‌నగర్ పోలీసులు ఏప్రిల్ 24న సికింద్రాబాద్‌లో మెరుపు దాడి చేసి శివరంజని బాయిని అదుపులోకి తీసుకున్నారు. ఆమెను కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 15 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. ఈ కేసులో ప్రధాన నిందితులు ఏ1 కరణ్ సింగ్, ఏ2 రతన్ సింగ్, ఏ3 రవీందర్, ఏ5 రాణా సింగ్ ప్రస్తుతం పరారీలో ఉన్నారని, వారి కోసం గాలింపు ముమ్మరం చేశామని ఎస్పీ తెలిపారు. నిందితురాలిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన కాగజ్‌నగర్ డీఎస్పీ వాహిదుద్దీన్, టౌన్ ఇన్ స్పెక్టర్ ప్రేమ్ కుమార్, ఎస్సై రాజు, మహిళా కానిస్టేబుళ్లు లక్ష్మి, జ్యోష్ణ, బ్లెస్సీ, శమీనా అభినందించారు.



## అటవీ ఉత్పత్తుల కొనుగోలు ప్రారంభం

### జీసీసీ డివిజనల్ మేనేజర్ సందీప్ కుమార్

**ఉట్నూర్, ఏప్రిల్ 25 (ప్రభాత సమాచారం):** గిరిజన సహకార సంస్థ (జీసీసీ)ద్వారా అటవీ ఉత్పత్తుల కొనుగోలు ప్రారంభించామని జీసీసీ డివిజనల్ మేనేజర్ గుడిమళ్ల సందీప్ కుమార్ జీసీసీ మేనేజర్లు, సేల్స్ మేన్‌లకు సూచనలు చేశారు. శనివారం ఉట్నూరు డివిజనల్ కార్యాలయంలో మేనేజర్లు, సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో సందీప్ కుమార్ మాట్లాడుతూ... గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ద్వారా అటవీ ఉత్పత్తుల సేకరణ ప్రారంభించామన్నారు. గిరిజనులు, ఆదివాసీలు సేకరించినటువంటి అటవీ ఉత్పత్తులైన ఇప్ప పువ్వు, ఇప్ప పరక, తేనె, మైనం, చింతపండు లను జీసీసీ సొసైటీ కార్యాలయాల వద్ద, డిఆర్ డిపోల వద్ద కు తీసుకొని వచ్చి విక్రయించాలని కోరారు. తక్కువ ధరకు అమ్మి నష్టపోవద్దని తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు, గిరిజన సహకార సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బిఎం సంతోష్ ఐఏఎస్, ప్రాజెక్టు అధికారి యువరాజు మర్మాట్ వారి ఆదేశాల ప్రకారం అటవీ ఉత్పత్తుల కొనుగోలు వెంటనే ప్రారంభించామని ఈ సందర్భంగా సందీప్ కుమార్ తెలిపారు. గిరిజనులు, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, మధ్య దళారులను నమ్మి మోసపోవద్దని జీసీసీ డిపోల వద్ద విక్రయించి రశీదు పొందాలని ఈ సందర్భంగా సందీప్ కుమార్ సూచించారు. అనంతరం ఉట్నూర్ జీసీసీ సొసైటీ కార్యాలయం లో సేల్స్ మెన్ తో ఏర్పాటు చేసిన సమావేశం లో సైతం మాట్లాడుతూ క్షేత్ర స్థాయి లో సిబ్బంది పర్యటించాలని, ఆదివాసీలకు, గిరిజనులకు అవగాహన కల్పించాలనిలి దిశానిర్దేశం చేశారు.

# మే 11 నుండి జిల్లాలో తొలి విడత జనాభా గణన

## జిల్లా కలెక్టర్ హరిత



**ఆసిఫాబాద్, ఏప్రిల్ 25 (ప్రభాత సమాచారం):** జిల్లాలో మొదటి విడత జనాభా గణన ప్రక్రియను విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ హరిత తెలిపారు. శనివారం సమీకృత కలెక్టరేట్ మందిరంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ 2027 మే 11 నుండి జిల్లావ్యాప్తంగా జనాభా గణన ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా ప్రజలు తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకునేందుకు ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు 'స్వీయ గణన' అవకాశం కల్పించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, విద్యావంతులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సాధారణ ప్రజలు ఆన్‌లైన్ పోర్టల్‌లో తమ వివరాలను నమోదు చేసుకుని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జిల్లావ్యాప్తంగా ఈ ప్రక్రియ నిర్వహణ కోసం మొత్తం 1689 ఇళ్ల బ్లాకులను గుర్తించామని, క్షేత్రస్థాయిలో విధుల నిర్వహణకు 994 మంది ఎన్యుమరేటర్లను, 174 మంది సూపర్ వైజర్లను నియమించినట్లు కలెక్టర్ వివరించారు. జనాభా గణనపై ప్రజల్లో అవగాహన కల్పించడంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు చురుకైన పాత్ర పోషించాలని, స్వీయ గణన విధానం అందరికీ తెలిసేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



### ఆదివాసీ మహిళలకు

## ఉచిత కుట్టు మిషన్ శిక్షణ ప్రారంభం

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 25 (ప్రభాత సమాచారం):** జైనూర్ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో "పోలీసులు మీకోసం" కార్యక్రమం భాగంగా వసుధ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఆదివాసీ మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ నితికా పంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళలు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఇతరులపై ఆధారపడకుండా తమ కుటుంబాలను పోషించుకునే సామర్థ్యం సాధించడానికి ఇది మంచి అవకాశం అని పేర్కొన్నారు. మహిళలు స్వావలంబనతో సమాజంలో గౌరవప్రదమైన స్థానం పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి సహకరించిన వసుధ ఫౌండేషన్‌కు ఎస్పీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జైనూర్ సీఐ రమేష్, ఎస్సైలు రవి కుమార్, విక్రమ్, గ్రామ సర్పంచ్ కొడప ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



## వర సంతలో అంబలి పంపిణీ

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 25 (ప్రభాత సమాచారం):** జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఖదీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంబలి పంపిణీ శనివారం చేశారు. ఈ కార్యక్రమానికి ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల్ల మంగ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అబ్దుల్లాబిన్ అహ్మద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉబెద్ బిన్ యహియా (తారిఖ్) ఆధ్వర్యంలో తీవ్ర ఎండల సమయంలో బాటసారులు, ప్రజలకు ఉచితంగా అంబలి పంపిణీ చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. గత పది సంవత్సరాలుగా ప్రతి వేసవిలో అంబలి పంపిణీ చేయడాన్ని ప్రశంసించారు.

## వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 25 (ప్రభాత సమాచారం):** ఉమ్మడి జిల్లా గిరిజన క్రీడాకారులు వేసవి శిక్షణ శిభిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ హరిత అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో ఉమ్మడి జిల్లా గిరిజన విద్యార్థులకు ఏర్పాటు చేసిన వేసవి క్రీడల శిక్షణ శిభిరాన్ని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రమాదేవితో కలిసి కలెక్టర్ హరిత ప్రారంబించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా గిరిజన విద్యార్థుల కొరకు వేసవి క్రీడల శిక్షణ లో భాగంగా హ్యాండ్ బాల్, కబడ్డీ, అథ్లెటిక్ పై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు ఈ శిక్షణ శిభిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



## బిల్లుల చెల్లింపునకు ఆన్ లైన్ సేవలు మేలు



**మంచిర్యాల, ఏప్రిల్ 25 (ప్రభాత సమాచారం):** జిల్లాలో ఎండలు రోజు రోజుకు పెరుగుతున్న దృష్ట్యా విద్యుత్ వినియోగదారులు ఆన్ లైన్ ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపులు చేయడం మేలు. విద్యుత్ వినియోగదారుల సౌలభ్యం కోసం నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ డిజిటల్ చెల్లింపుల విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. రోజు రోజుకు సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందుతున్న తరుణంలో విద్యుత్ బిల్లుల చెల్లింపుల విషయంలో వినియోగదారులు ఆన్ లైన్ ద్వారా చెల్లించాలని వినియోగదారులను విద్యుత్ శాఖ అధికారులు కోరుతున్నారు. ప్రతి సంవత్సరం పది శాతం విద్యుత్ వినియోగదారులు తమ నెలవారీ బిల్లులను యాప్, టి. వ్యాలెట్, వంటి డిజిటల్ ప్లాట్ ఫారంల ద్వారా చెల్లిస్తున్నారని, ఎండలను దృష్టిలో పెట్టుకొని ఇంటి వద్దనే ఉండి డిజిటల్ చెల్లింపులు మరింత పెంచాలని అవగాహన కల్పిస్తున్నారు. 2024- 25 ఆర్థిక సంవత్సరంలో 5,49,697 మంది వినియోగదారులు ఆన్ లైన్ ద్వారా చెల్లింపులు చేయగా 2025- 26 ఆర్థిక సంవత్సరంలో 6,48,839 మంది వినియోగదారులు డిజిటల్ విధానం ద్వారా చెల్లింపులు చేసినట్లు సంబంధిత శాఖ అధికారులు అధికారికంగా వెల్లడించారు. వేసవి తీవ్రత దృష్ట్యా లబ్ధిదారులు ఇంటి వద్ద ఉండి సురక్షితంగా బిల్లులు చెల్లిస్తే డిజిటల్ చెల్లింపులు మరింత పెరిగే అవకాశం ఉంది.

## అనుమతులేని విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



**బెల్లంపల్లి, ఏప్రిల్ 25 (ప్రభాత సమాచారం):** నకిలీ పత్తి విత్తనాలు కొనుగోలుచేసినా ,విక్రయించిన రవాణా చేసినా కఠినమైన చర్యలు ఉంటాయని మంచిర్యాల డీసీపీ భాస్కర్ అన్నారు. బెల్లంపల్లి శ్రేయస్ బంక్వట్ హాల్లో వ్యవసాయ,పోలీస్, రెవిన్యూ శాఖల ఆధ్వర్యంలో లైసెన్స్ కలిగిన విత్తన డీలర్స్ కు అనదికార, నకిలీ విత్తనాలా నివారణ పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైనా మంచిర్యాల డీసీపీ భాస్కర్ పాల్గొని మాట్లాడారు. నకిలీ విత్తనాల విక్రయాలపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. నకిలీ విత్తనాల దందాను నిర్మూలించేందుకు ఎప్పటికప్పుడు కార్డెన్ సెర్చ్ తనిఖీలు చేపట్టాలన్నారు. నకిలీ విత్తనాల వ్యాపారాన్ని నివారించేందుకు సమిష్టిగా పనిచేయాలన్నారు. ఈ ప్రక్రియలో డీలర్ల పాత్ర కూడా ఉండాలన్నారు. నకిలీ విత్తనాలను కొనుగోలు చేసి రైతులు మోసపోవద్దన్నారు. నకిలీ పత్తి విత్తనాలతో భూసారం దెబ్బతిని రైతులకు తీరం నష్టం జరుగుతుందన్నారు. ఎట్టి పరిస్థితుల్లో రైతులు నకిలీ విత్తనాలను ఆశ్రయించద్దన్నారు. నకిలీ విత్తనాల వ్యాపారాన్ని నిర్మించేందుకు పోలీసులకు సహకరించాలన్నారు. బెల్లంపల్లి వ్యవసాయం అధికారి సుద్దాల ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ నాణ్యమైన విత్తన్నన్ని, నకిలీ విత్తనాన్ని ఎలా గుర్తించాలో, నకిలీ విత్తనాలు అమ్మితే ఎలాంటి చట్టపరమైన శిక్షలు పడతాయో వివరించారు. బెల్లంపల్లి అగ్రికల్చర్ ఏడి రాజానరేందర్ మాట్లాడుతూ లైసెన్స్ పొందిన డీలర్స్ ఎవరుకూడా నకిలీ విత్తన దందాలో ప్రత్యేక్షంగా గాని, పరోక్షంగా గాని భాగస్వాములు కావద్దని, ఎవరైనా సహకరిస్తే లైసెన్స్ రద్దుచేసి క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్, చెన్నూర్ ఏడీఏ ప్రసాద్ పాల్గొన్నారు.

## వైద్య సేవలో బెల్లంపల్లి ఆసుపత్రికి ఎనలేని విశిష్టత

### బెల్లంపల్లి ప్రజల కలలను నిజం చేస్తా.. ఏరియా ఆస్పత్రికి పూర్వవైభవం

### సింగరేణి డైరెక్టర్ (పీపీ) వెంకటేశ్వర్లు

**బెల్లంపల్లి, ఏప్రిల్ 25 (ప్రభాత సమాచారం):** సింగరేణి ఆస్పత్రుల్లోకెల్లా బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆసుపత్రికి వైద్యసేవల్లో ఎనలేనీ విశిష్టత ఉందని, ఈ ఆసుపత్రి పై ప్రజలు పెట్టుకొన్న కలలను నిజం చేస్తానని సింగరేణి డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్) కే వెంకటేశ్వర్లు అన్నారు. రూ. 80 లక్షలతో మరమ్మతులు చేసి పునర్నిర్మాణంతో కొత్త రూపం ధరించిన ఆస్పత్రి భవనాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడారు. బెల్లంపల్లి ఏరియాపత్రి వైద్య సేవారంగంలో ముఖ్యమైన పాత్ర పోషించిందన్నారు. అలాంటిది నేడు వైద్య సేవలు తగ్గుముఖం పట్టాయన్నారు. బెల్లంపల్లి ఆసుపత్రికి పూర్వవైవం కల్పించి కార్మిక కుటుంబాలకు అత్యున్నతమైన వైద్య సేవలు అందిస్తామన్నారు. కార్మికుల సంఖ్య ప్రాతిపదికన వైద్య సేవలను ఉండరాదన్నారు. అన్ని వసతులు, వైద్యులు, సిబ్బంది కొరత లేకుండా ఆస్పత్రిని తీర్చిదిద్దామన్నారు. సింగరేణి ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది కార్మికులకు ఓపికతో మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. వైద్య సేవలో సింగరేణి ఆసుపత్రి వైద్యులు,సిబ్బందికి ఇప్పటివరకైతే మంచి గుర్తింపు ఉందన్నారు. సింగరేణిలో బెల్లంపల్లి ఏరియాలో కొత్త గనులు వస్తాయన్నారు. కార్మికుల రిక్రూమెంట్ కూడా పెరుగుతుందన్నారు. గోలేటి, మహావీర్ ఖని ఓపెన్ కాస్టులు వస్తాయని వెల్లడించారు. కేకే ఓసీపీ విస్తరణ కూడా జరుగుతుందన్నారు. కొంత ఆలస్యమైనా మరిన్ని గనులు రానున్నాయన్నారు. కార్మికులకు వైద్య సేవలు మెరుగుపరచాల్సిన అవసరం ఏర్పడుతుందన్నారు. బెల్లంపల్లి ఏరియా ఆసుపత్రి వైద్య సామర్థ్యం బలోపేతం తప్పనిసరన్నారు. సింగరేణిలో వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాలని పిలుపునిచ్చారు. గత వార్షిక లక్ష్యాన్ని బెల్లంపల్లి,సత్తుపల్లి ఏరియా కార్మికులు మాత్రమే సాధించారని వెల్లడించారు. అందుకుగాను రెండు ఏరియాల జీఎం లు కార్మికులను అభినందించారు. అదే స్ఫూర్తిని తో సింగరేణి యావత్తు కార్మికులు, అధికారులు పనిచేయాలన్నారు. బొగ్గు ఉత్పత్తి పెరిగితేనే సింగరేణి సంస్థ అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి జీఎం విజయ భాస్కర్ రెడ్డి, బెల్లంపల్లి డివైసీఎంవో పాండురంగ చారి, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, సీనియర్ నాయకుడు చిప్ప నర్సయ్య, ఏఐటీయూసీ ఆస్పత్రి ఫిట్ సెక్రటరీ శ్రీధర్, టీబీజీకేఎస్ కార్యదర్శి అనుముల సత్యనారాయణ, ఆస్పత్రి మెట్రిన్, మెడికల్ ఆఫీసర్లు, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రధానమంత్రి అజయ్ పథకం ప్రతిపాదిత పనులను వేగవంతం చేయాలి

## మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య



**దండేపల్లి, ఏప్రిల్ 25 (ప్రభాత సమాచారం):** ప్రధానమంత్రి అజయ్ పథకం క్రింద ప్రతిపాదిత పనులను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య అన్నారు. శనివారం జిల్లాలోని దండేపల్లి మండలం ధర్మారావుపేట గ్రామపంచాయతీలో పర్యటించి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా కొనసాగుతున్న పారిశుధ్య పనులు, నర్సరీ, నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లు, వ్యర్థాల వర్గీకరణ షెడ్డును పరిశీలించి ప్రధానమంత్రి అజయ్ పథకం క్రింద ప్రతిపాదించిన సిసి మురుగు కాలువలు, కల్వర్టులు, త్రాగునీటి పైప్ లైన్ల కొరకు గుర్తించిన స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో భాగంగా చేపట్టిన పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. మండలంలోని ముత్యంపేట్, చెల్కగూడ, ధర్మారావుపేట గ్రామపంచాయతీలలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులు, పారిశుధ్య కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా పనులు కొనసాగుతున్న ప్రదేశాలలో ఉపాధి కూలీలకు నీడ, త్రాగునీరు సౌకర్యాలు కల్పించి ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఉపాధి కూలీలతో మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. కూలీలతో ప్రత్యక్షంగా మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక"లో భాగంగా చెల్కగూడ చెరువులో జరుగుతున్న పనులను తనిఖీ చేసి గ్రామంలో పారిశుద్ధ్యం, వడ్ల కొనుగోలు, త్రాగునీటి సరఫరా, నూతన పింఛన్లు, రేషన్ బియ్యం పంపిణీ, మురుగు కాలువల పరిస్థితులపై వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ అభివృద్ధి పథకాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ



కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు, మండల ప్రత్యేక అధికారి దుర్గాప్రసాద్, జిల్లా స్థాయి పంచాయతీ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల పంచాయతీ అధికారి, సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# పెట్టుబడుల పేరుతో మోసం

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 25 (ప్రభాత సమాచారం):** తమ సంస్థలో పెట్టుబడులు పెడితే భారీగా లాభాలు వస్తాయని నమ్మించి మోసగించిన కేసులో ఒకరిని అరెస్టు చేశామని ఎస్పీ నితికా పంత్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలను ఎస్పీ వెల్లడించారు. కాగజ్‌నగర్ పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగిన రూ 2 కోట్ల భారీ పెట్టుబడి మోసం కేసులో నిందితురాలైన థాకూర్ శివరంజనిబాయిని అరెస్టు చేసినట్లు ఎస్పీ తెలిపారు. డివైన్ గ్రూపు ఆఫ్ కంపెనీ పేరిట నకిలీ వ్యాపారం నిర్వహిస్తు ప్రజలను పెట్టుబడులు పెట్టమని కోరిందని చెప్పారు. అధిక లాబాలు వస్తాయని నమ్మబలికి బాధితుల నుంచి సుమారు రూ. 2 కోట్ల మొత్తంలో నగదు వసూలు చేశారని వెల్లడించారు. ఐదు నుంచి 20 శాతం వరకు లాబాలు ఇస్తామని చెప్పి మోసాలకు పాల్పడ్డారు. కాగజ్‌నగర్, పెంచికలపేట, హైదరాబాద్ ప్రాంతాలలో, 2021 నుంచి 2023 మధ్య కాలంలో కాగజ్‌నగర్ పట్టణంలో నివసిస్తూ ప్రజలను నమ్మబలికి డబ్బులు తీసుకొని పరారయ్యారని చెప్పారు. ఈ కేసులో మొత్తం ఐదుగురు నిందితులు ఉన్నారని చెప్పారు. ఇందులో థాకూరు శివరంజనిబాయిని అరెస్టు చేశామని చెప్పారు. మిగిలిన నిందితులు థాకూర్ కరణ్‌సింగ్, థాకూర్ రతన్‌సింగ్, థాకూర్ రవీందర్, థాకూర్ రాణాసింగ్‌లు పరారీలో ఉన్నారని వివరించారు. వారి కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కేసులో నిందితురాలని అరెస్టు చేయడంలో కీలకపాత్ర పోషించిన కాగజ్‌నగర్ డీఎస్పీ వహీదుద్దీన్, టౌన్ ఇన్స్‌పెక్టర్ ప్రేంకుమార్, ఎస్సై రాజు, మహిళా కానిస్టేబుళ్లు లక్ష్మి, జ్యోత్స్న, బ్లేస్సీ, షమీనా, కానిస్టేబుల్ విజయ్‌ను ఈ సందర్భంగా ఎస్పీ అభినందించారు.

# రైతాంగాన్ని పూర్తిగా విస్మరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

## మాజీఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

**దండేపల్లి, ఏప్రిల్ 25 (ప్రభాత సమాచారం):** రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పుకుని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగాన్ని పూర్తిగా విస్మరిస్తున్నదని మంచిర్యాల మాజీఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. శనివారం దండే పల్లిలో ఏర్పాట్లు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. అకాల వర్షాలు ముంచుకొచ్చే ప్రమాదం కన్పిస్తున్నా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించ డంలో ప్రభుత్వం అలసత్వం చూపిస్తున్న దన్నారు. గ్రామాల్లో కోనుగోలు కేంద్రాలు ప్రారం భించారే తప్ప ఇప్పటికి వరకు ఒక గింజను కోనుగోలు చేయలేదన్నారు. స్థానికంగా సాగైనా వరి, మొక్కజొన్న ఉత్పత్తులకు అనుగుణంగా తగినన్ని కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి, సకాంలో వ్యవసాయ ఉత్పత్తులను మిల్లులకు తరలించాలని ఆయన రైతుల పక్షాన డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన 1క్వింటాల్‌కు



500బోనస్ డబ్బును కూడా సకాలంలో రైతు లకు చెల్లించాలని డిమాండ్ చేశారు. తరుగు పేరిట రైతులను ఇబ్బందులకు గురి చేయ వద్దన్నారు. అనంతరం కోనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన వడ్లకుప్పల వద్దకు వెళ్లి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్, మాజీవైస్ ఎంపీపీ పసర్తి అనిల్‌కుమార్, మాజీపీఏసీఎస్ వైస్‌చైర్మన్ అక్కల రవిందర్, నాయకులు శ్రీనివాస్, భూమన్న, తిరుపతి, రాజమల్లు, రవి, అజయ్, అఖిల్, హరీష్, రాజన్న, మహేష్,, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.




# మార్వాడీ యువమంచ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం ప్రారంభం

**బెల్లంపల్లి, ఏప్రిల్ 25 (ప్రభాత సమాచారం):** అఖిల భారత మార్వాడీ యువ మంచ్, బెల్లంపల్లి నగర శాఖ ఆధ్వర్యంలో 31 రోజుల పాటు 31 ప్రదేశాలలో మజ్జిగ పంపిణీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించాలని తీర్మానం చేశారు. ఈ కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. తీవ్రమైన ఎండల దృష్ట్యా, అంబేద్కర్ కాంటా చౌరస్తాలోని హనుమాన్ ఆగ్రోస్ దుకాణం ముందు సుమారు 1,150 గ్లాసుల మజ్జిగను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా, యువ మంచ్ అధ్యక్షుడు కృష్ణకాంత్ సోని మాట్లాడుతూ, ఈ కార్యక్రమానికి యువ మంచ్ సభ్యులకు మద్దతు ఇచ్చిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. సమాజంలోని పెద్దల మార్గదర్శకత్వంలో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యువ మంచ్ సభ్యులు బాలు మారు, కమల్ లహోటి, అరవింద్ అగర్వాల్, రాజేంద్ర లహోటి, అజయ్ లహోటి, దినేష్ సారడా తదితరులు పాల్గొన్నారు.



# చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**కడెం, ఏప్రిల్ 25 (ప్రభాత సమాచారం):** కడెం మండలంలో 61 కల్యాణలక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ శనివారం లబ్ధిదారులకు అందజేశారు కడెం మండలంలోని 61 మంది లబ్ధిదారులకు చెక్కులను అందించి ప్రభుత్వం పేద ప్రజలకు అండగా ఉంటుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందని, మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఉచిత బస్సు, మహిళా సంఘాల ద్వారా రుణాలు, ఆర్టీసీ బస్సుల కొనుగోలు కార్యక్రమాలు చేస్తున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, లబ్దిదారులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటు వద్దు.. ప్రభుత్వ పాఠశాల ముద్దు

**ఖానాపూర్, ఏప్రిల్ 25 (ప్రభాత సమాచారం):** తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలో చదువుపించి ఆర్థిక భారం భరిస్తున్నారని దానికంటే ప్రభుత్వ పాఠశాలలో ముద్దు అని తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని, నిర్మల్ జిల్లా డీసీసీ ఉపాధ్యక్షులు, 11వ వార్డు కౌన్సిలర్ రాజుర సత్యం అన్నారు. శనివారం ఖానాపూర్ పట్టణంలోని రాజీవ్ నగర్ కాలనీ, అంగన్వాడీ కేంద్రంలో పాఠశాల గ్రాడ్యుయేషన్ డే, అన్నప్రాసన, గర్భిణీ స్త్రీలకు శ్రీమంత, కార్యక్రమంలో పాల్గొని మాట్లాడాను. తమ ప్రభుత్వం విద్యా, ఆహారంపై శ్రద్ధ వహిస్తుందని విద్యార్థులు ప్రైవేటుకు కాకుండా ప్రభుత్వ పాఠశాలలో చేరి భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి సిడిపిఓ శ్రీలత, అంగన్వాడి టీచర్ విజయలక్ష్మి, ఆర్పి సునీత, ఏఎన్ఎం పార్వతి ,లావణ్య, ఆశా కార్యకర్తలు సునీత ,వాణి, ఆయమ్మ జాదవ్ కౌసల్య, మహిళలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# జూనియర్ సానిటరీ ఇన్స్ స్పెక్టర్ పోస్టింగ్ వెబ్ కౌన్సిలింగ్



**మంచిర్యాల, ఏప్రిల్ 25 (ప్రభాత సమాచారం):** జూనియర్ సానిటరీ ఇన్స్ స్పెక్టర్ పోస్టింగ్ ఎంపిక కోసం సింగరేణి సంస్థ నిర్వహించిన వెబ్ కౌన్సెలింగ్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించారు. సింగరేణి వ్యాప్తంగా ఖాళీగా ఉన్న జూనియర్ సానిటరీ ఇన్స్పెక్టర్ ( గ్రేడ్ ఐ) భర్తీ కోసం ఇంటర్నల్ విధానంలో నిర్వహించిన రాత పరీక్షలో ఎంపికైన అభ్యర్థులకు పోస్టింగ్ ఎంపిక కోసం శనివారం వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్పోరేట్ కార్యాలయంలో వెబ్ కౌన్సెలింగ్ లో ఒకరు పాల్గొనగా శ్రీరాంపూర్ ఏరియా నుంచి ఐదుగురు, ఆర్జీ 1 నుంచి ఒకరు, ఆర్జీ 2 నుంచి ఒకరు, మందమర్రి ఏరియా నుంచి ఒకరు శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన వెబ్ కౌన్సెలింగ్‌లో పాల్గొన్నారు. వెబ్ కౌన్సెలింగ్‌లో పాల్గొన్న ఎనిమిది మంది అభ్యర్థులు తమకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగపరుచుకొని తమకు అనుకూలమైన, అవకాశం ఉన్న ఏరియాలో పోస్టింగ్ ఎంచుకున్నారు. ఎవరైన పోస్టింగ్ తిరస్కరిస్తే మూడు ఏళ్ల వరకు అర్హత కోల్పోతారని ముందుగానే ప్రకటించారు. మొత్తం తొమ్మిది ఖాళీలలో తొమ్మిదికి తొమ్మిది పోస్టులను ఎంపిక చేసుకున్నారు. ఈ వెబ్ కౌన్సెలింగ్ శ్రీరాంపూర్ ఏరియా డీవైపీఎం రాజేష్, సీనియర్ పీఓ మురళి, ఐఈడీ ఇంజనీర్ సంగీత, సీనియర్ అసిస్టెంట్ నవీన్‌ల ఆధ్వర్యంలో జరగగా రాత పరీక్ష మెరిట్ అభ్యర్థులు పాల్గొన్నారు.

# నకిలీ పత్తి విత్తనాల రాకెట్ గుట్టురట్టు









**150 విత్తన ప్యాకెట్లు, నగదు స్వాధీనం**
**నలుగురు నిందితుల అరెస్ట్**
**వివరాలు వెల్లడించిన డీఎస్పీ జీవన్‌రెడ్డి**

**ఆదిలాబాద్, ఏప్రిల్ 25 (ప్రభాత సమాచారం):** జిల్లాలో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న నకిలీ పత్తి విత్తనాల విక్రయాల దందాను పోలీసులు గుట్టురట్టు చేశారు. శనివారం బేల పోలీ స్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీఎస్పీ జీవన్‌రెడ్డి వివరాలు వెల్లడిం చారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు పక్కా సమాచారంతో సాంగిడి గ్రామ శివారులో రోడ్డు ప్రక్కన కొంతమంది వ్యక్తులు నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్నట్లు తెలియడంతో శనివారం తనిఖీలు నిర్వహించామన్నారు. విత్తనాలు నకిలీవా? కాదా? అని నిర్ధారించేందుకు వ్యవసాయ శాఖ అధికారిని సం ఘటన స్థలానికి పిలిపించి పరిశీలించామని చెప్పారు. దీంతో నకిలీ పత్తి విత్తనాలు అని తేలినట్లు డీఎస్పీ తెలిపారు. తనిఖీలలో నింది తుడు జిట్టావార్ కిషోర్ రెడ్డి అనే వ్యక్తి గుజరాత్‌కు చెందిన నరేష్ క్రాప్ సైన్స్ కంపెనీలో కమిషన్ ఏజెంట్‌గా పని చేస్తూ, అదే కంపెనీలో పని చేసే ధర్మేష్ కచ్చుడియా అనే వ్యక్తితో కలిసి కుట్రపన్ని నరేష్ క్రాప్ సైన్స్ సంస్థకి సంబంధించిన 'మౌళి ఉన్న నిజమైన ప్రత్తి విత్తన ప్యాకెట్‌ను 'మౌళి పేరుతో నకిలీ పత్తి విత్తనాలను తయారు చేసి విక్రయిస్తున్నట్లు గుర్తించామన్నారు. గత రెండు నెలలుగా గుజరాత్ నుంచి నవత ట్రాన్స్‌పోర్ట్ ద్వారా సుమారు 4,500 నకిలీ విత్తనాల ప్యాకెట్లు తెప్పించి, అందులో 4,000 ప్యాకెట్లను మహారాష్ట్రలో రక్తావర్ పవన్ ద్వారా, 350 ప్యాకెట్లను నవగరే కునాల్, కుల్దీప్ టాక్రె ద్వారా రైతులకు అసలైన విత్తనాలుగా నమ్మించి విక్రయించినట్లు విచారణలో వెల్లడైందన్నారు. తనిఖీల్లో 150 నకిలీ పత్తి విత్తనాల ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నకిలీ విత్తనాల విక్రయం ద్వారా వచ్చిన రూ. 60,000 నగదు, నిందితులు ఉపయోగించిన మొబైల్ ఫోన్లు, ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ప్యాకెట్లపై కంపెనీ పేరు, తయారీ తేదీ, పరీక్ష తేదీ, గడువు తేదీ, ఎమ్మార్పీ వంటి వివరాలు లేకపోవడం గమనించామన్నారు. రెండు ప్యాకెట్లను నమూనాలుగా తీసుకొ ని పరీక్షకు పంపించి, మిగతా వాటిని స్వాధీ నం చేసుకున్నారు. ఈ కేసులో నిందితులు జిట్టావార్ కిషోర్ రెడ్డి, రక్తావర్ పవన్, నవగరే కునాల్, కుల్దీప్ టాక్రెలను అదుపులోకి తీసుకోగా, ధర్మేష్ కచ్చుడియా కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. మీడియా సమావేశంలో ఆదిలాబాద్ రూరల్ సీఐ ఫణిదర్, ఎస్ఐ మధుకృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదవశాత్తు చెరువులో పడి రైతు మృతి



**ఆదిలాబాద్, ఏప్రిల్ 25 (ప్రభాత సమాచారం):** ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ రైతు మృతి చెందిన విషాద ఘటన ఆదిలాబాద్ రూరల్ మండలం జందాపూర్ లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన సొప్పరి సాయి అనే రైతు ఎడ్లబండితో చెరువు దాటుతుండగా, బండి మట్టిలో ఇరుక్కుపోయింది. దానిని బయటకు తీసే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు నీటిలో పడి రైతు ప్రాణాలు కోల్పోయాడు. దీంతో మృతుడి కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి. కాగా రైతు మరణించిన విషయాన్ని తెలుసుకున్న మాజీ మంత్రి జోగు రామన్న రిమ్స్ ఆసుపత్రి కి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతికి గల కారణా న్ని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. రైతు ప్రమాదంలో మృతి చెందడం అత్యంత బాధాకరమైన విషయం అని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. తీవ్ర విషాదంలో ముంచిందని, కుటుంబ సభ్యులకు ఇది తీరని లోటని పేర్కొన్నారు. రైతు మరణం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రభుత్వంస్పందించి మృతుని కుటుంబానికి నష్టపరిహారం బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు.



## వడదెబ్బతో ట్రాక్టర్ డ్రైవర్ మృతి

**తాండూర్, ఏప్రిల్ 25 (ప్రభాత సమాచారం):** మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం రేచిని గ్రామపంచాయతీ పరిధి బారెపల్లి గ్రామానికి చెందిన కోట్రంగి జయరాం(40) అనే ట్రాక్టర్ డ్రైవర్ వడదెబ్బతో మృతి చెందినట్లు తాండూర్ ఎస్సై కే ప్రసాద్ తెలిపారు. శుక్రవారం పని నిమిత్తం బెల్లంపల్లి వెళ్లి ఎండ దెబ్బకు గురై మధ్యాహ్నం ఇంటికిరాగా సాయంత్రం వాంతులు, విరేచనాలు అయ్యాయని వివరించారు. అదే రాత్రి 11గంటలకు బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా అక్కడ వైద్యులు పరీక్షించి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల వెళ్లాలని సూచించారని వెల్లడించారు. మంచిర్యాల తీసుకువెళ్తుండగా మార్గమధ్యంలో చనిపోయాడని పేర్కొన్నారు. మృతుని భార్య నీలబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవ పంచనామ నిర్వహించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

## తానూర్‌లో వీధి కుక్కల దాడి ఇద్దరు చిన్నారులకు గాయాలు

**ముథోల్, ఏప్రిల్ 25 (ప్రభాత సమాచారం):** నిర్మల్ జిల్లా తానూర్ మండల కేంద్రంలో శుక్రవారం వీధి కుక్కలు రెచ్చిపోయి, ఆడుకుంటున్న ఇద్దరు చిన్నారులపై దాడి చేసి గాయపరిచాయి. స్థానికులు వెంటనే స్పందించి కుక్కలను తరిమికొట్టి, గాయపడిన చిన్నారులను భైంసా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారికి చికిత్స అందుతోంది. తానూర్‌లో వీధి కుక్కల సంఖ్య పెరుగుతోందని, పిల్లలు బయటకు రావాలంటేనే తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

# ఇంటర్ ఫలితాల్లో పురోగతి సాధించాలి





**■ ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**ఆదిలాబాద్, ఏప్రిల్ 25 (ప్రభాత సమాచారం):** ఇంటర్ ఫలితాల్లో పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్‌లతో ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ, గత పరీక్షల ఫలితాలు, ఇతర అంశాలపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించి దిశ నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గత పరీక్షల ఫలితాల్లో ఫలితాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఫలితాల్లో గణనీయమైన మెరుగుదల ఉండాలని, గత సంవత్సరం కంటే మెరుగైన ప్రదర్శన కనబరచాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం కళాశాలల వారీగా, సబ్జెక్టుల వారీగా ప్రత్యేక వ్యూహాలను రూపొందించాలని ఆదేశించారు. గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ వంటి ఏ సబ్జెక్టుల్లో ఎక్కువ మంది విద్యార్థులు ఫెయిల్ అవుతున్నారో గుర్తించి, ఆయా సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఫెయిల్ అయిన విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించేలా పర్యవేక్షించాలని ప్రిన్సిపాల్‌లను ఆదేశించారు. విద్యాబోధనను పర్యవేక్షించేందుకు అనుభవజ్ఞులైన అధ్యాపకులతో కూడిన ప్రత్యేక ప్యానెల్‌ను ఏర్పాటు చేయాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిని ఆదేశించారు. ఈ ప్యానెల్ బృందాలు క్రమం తప్పకుండా కళాశాలలను సందర్శించి, బోధనా విధానాలను, విద్యార్థుల పురోగతిని పర్యవేక్షిస్తాయని తెలిపారు. అనంతరం కళాశాలల వారిగా ఫలితాలపై కలెక్టర్ సమీక్షించి పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి గణేష్ జాదవ్, సెక్టోరల్ అధికారి ప్రత్యూష, వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపాల్‌లు పాల్గొన్నారు.

# ప్రజా పాలనతోనే ప్రగతి సాధ్యం





## ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, ఏప్రిల్ 25 (ప్రభాత సమాచారం):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యక్రమంలో భాగంగా, ఆదిలాబాద్ జిల్లాలో ఈ నెల 27 నుంచి మే 2వ తేదీ వరకు వారం రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా ప్రకటించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా ఈ కార్యాచరణను రూపొందించి, అనాథ పిల్లలు, యువత, పసిబిడ్డల ఆరోగ్యం, భద్రతపై ఈ వారం రోజులు ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు వివరించారు. ప్రణాళికలో భాగంగా తొలిరోజైన ఏప్రిల్ 27న 18 ఏళ్లు నిండిన అనాథ, పాక్షిక అనాథ పిల్లలకు ప్రత్యేక హెల్త్ స్క్రీనింగ్ నిర్వహించి, వారికి బ్యాంక్ ఖాతాలు, ఆధార్ కార్డులతో పాటు రూ. 5 లక్షల బీమా సౌకర్యం కల్పించేగ్రావీజీూ హెల్త్ కార్డులను పంపిణీ చేయనున్నాట్లు తెలిపారు. ఏప్రిల్ 28న బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన సదస్సులు, 29న సైబర్ క్రైమ్, మాదకద్రవ్యాల నిరోధంపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారని, అదే రోజు ప్రతి గ్రామంలో 'బాల గ్రామసభలు' ఏర్పాటు చేసి చిన్న పిల్లల సమస్యలపై చర్చించనున్నారు. ఏప్రిల్ 30న అంగన్‌వాడీల ద్వారా అనాథ పిల్లల వివరాల సేకరణకు సమగ్ర సర్వే నిర్వహించనున్నారు. కార్యక్రమం చివరి దశలో మే 1వ తేదీన రిమ్స్ ఆసుపత్రిలో ప్రత్యేక 'హెల్ప్ డెస్క్'ను ఏర్పాటు చేసి, 0–5 ఏళ్ల పిల్లలకు సంపూర్ణ వైద్య పరీక్షలు నిర్వహిస్తారని, మే 2వ తేదీన మాదకద్రవ్యాల వినియోగం ఎక్కువగా ఉన్న హాట్‌స్పాట్‌లను గుర్తించి అవగాహన కల్పించడంతో పాటు, బడి మానేసిన యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇచ్చి తిరిగి వారిని విద్యా మార్గంలోకి మళ్లించేలా చర్యలు చేపడతారని వివరించారు. ఈ ఏడు రోజుల కార్యక్రమాలను మండల, గ్రామ స్థాయి అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఆర్.ఎస్. చిత్రు, రాజేశ్వర్, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఆర్బీఎస్కే బృందాలు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచే 'డిజిటల్' జనగణన

## సెల్ఫ్ ఎన్యుమరేషన్ ద్వారా మీ వివరాలు మీరే నమోదు చేసుకోవచ్చు

### ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**ఆదిలాబాద్, ఏప్రిల్ 25 (ప్రభాత సమాచారం):** 'జనగణన–2026' ప్రక్రియలో అత్యంత కీలకమైన 'సెల్ఫ్ ఎన్యుమరేషన్' (స్వయం నమోదు) విధానం రేపటి (ఆదివారం) నుండి ప్రారంభం కానుందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు . శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో 'జనగణన–2026' పై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, దేశాభివృద్ధికి దిక్సూచిగా నిలిచే 'జనగణన–2026' ప్రక్రియలో అత్యంత కీలకమైన 'సెల్ఫ్ ఎన్యుమరేషన్' విధానం రేపటి నుండి ప్రారంభం కానుందని, జిల్లా ప్రజలందరూ ఈ డిజిటల్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏప్రిల్ 26 నుంచి మే 10వ తేదీ వరకు పౌరులు తమ వివరాలను వెబ్ పోర్టల్ లేదా మొబైల్ యాప్ ద్వారా స్వయంగా నమోదు చేసుకోవచ్చని ఆయన వెల్లడించారు. గతంలో జనగణన అధికారులు ఇంటింటికీ వచ్చి వివరాలు సేకరించేవారని, అయితే ఈసారి సాంకేతికతను జోడిస్తూ పౌరులే నేరుగా తమ సమాచారాన్ని సమర్పించే వెసులుబాటు కల్పించామని కలెక్టర్ తెలిపారు. దీనివల్ల సమయం ఆదా అవ్వడమే కాకుండా, సమాచారంలో తప్పులు దొర్లే అవకాశం ఉండదని వివరించారు. ప్రజలు అధికారిక సెన్సస్ పోర్టల్‌లో తమ మొబైల్ నంబర్ ద్వారా లాగిన్ అయి, కుటుంబ సభ్యుల విద్య, వృత్తి, నివాస వసతులు వంటి కీలక అంశాలను పొందుపరచాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వివరాల నమోదు పూర్తయిన తర్వాత ఒక రిఫరెన్స్ నంబర్ లేదా క్యూఆర్ (ఙ=) కోడ్ జనరేట్ అవుతుందని, తదుపరి దశలో గణన అధికారి ఇంటికి వచ్చినప్పుడు ఆ కోడ్ చూపిస్తే సరిపోతుందని



కలెక్టర్ స్పష్టం చేశారు. దీనివల్ల మళ్లీ మొదటి నుంచి వివరాలు చెప్పాల్సిన అవసరం ఉండదని, పౌరులు అందించే సమాచారం అత్యంత సురక్షితంగా, గోప్యంగా ఉంటుందని, ప్రభుత్వ సంక్షేమ పథకాల రూపకల్పన ఈ గణాంకాల ఆధారంగానే జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఖచ్చితమైన సమాచారాన్ని అందించి దేశ భవిష్యత్తు నిర్మాణంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఇతర జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు.

### ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా

# నిర్వహించేందుకు కీలక మార్పులు

### మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ రాములు



**మంచిర్యాల, ఏప్రిల్ 25 (ప్రభాత సమాచారం):** యాసంగి 2025–26 సీజన్ కు సంబంధించి ధాన్యం కొనుగోలు ప్రక్రియ మరింత వేగవంతంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు సాఫ్ట్ వేర్ లో ప్రభుత్వం కీలక మార్పులు చేసిందని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాములు ఒక ప్రకటనలో తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు సమీపంలో ఉన్న రైస్ మిల్లులకు ధాన్యం తరలించడం జరుగుతుందని, ప్రతి రైస్ మిల్లు సామర్థ్యాన్ని పరిగణలోకి తీసుకొని తదనుగుణంగా ధాన్యం కేటాయించేలా ఆధునీకరించడం జరిగిందని, ఈ మార్పుతో రవాణా సమయం, కొనుగోలు ప్రక్రియ వేగవంతమవుతుందని తెలిపారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం వేసిన తర్వాత గతంలో మాదిరిగా మాన్యువల్ ట్రక్ షీట్ ఉండదని, ఆన్ లైన్ లో మాత్రమే ట్రక్ షీట్ జనరేట్ చేయబడుతుందని, కొనుగోలు కేంద్రం, మిల్లుల టాకింగ్ ఆటోమేటిక్ గా అవుతుందని, ఆన్లైన్ లో జనరేట్ అయిన ట్రక్ షీట్ ను కొనుగోలు కేంద్రాల వారు ప్రింట్ తీసి ధాన్యపు లారీ వెంబడి మిల్లుకు పంపించాలని, ధాన్యం లారీ పక్కదారి పట్టకుండా జిపిఎస్ పరికరం బిగించబడి ఉంటుందని తెలిపారు. రైతు వివరాలను సిస్టం లో నమోదు చేసి ఆధార్ కార్డు ద్వారా వారి గుర్తింపును ధృవీకరించాలని, రైతు భూమి విస్తీర్ణం, పండించిన ధాన్యం వివరాలను సరి చూడాలని, ధాన్యం నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండే విధంగా పరిశీలించాలని, నాణ్యత అయితేనే రైతులకు గోనె సంచులు అందించాలని తెలిపారు. సంచులలో ధాన్యం నింపి కేంద్రం వద్ద తప్పనిసరిగా తూకం వేయాలని, రైతు ఆధార్ నిర్ధారణ ద్వారా ధాన్యం విక్రయాన్ని ధ్రువీకరించాలని, తూకం వేసిన ధాన్యాన్ని జిపిఎస్ కలిగిన ట్రక్కుల లో లోడ్ చేయాలని తెలిపారు. ఓ పి ఎం ఎస్ ద్వారా ట్రక్ చిట్ జనరేట్ చేయాలని, మిల్లు కేటాయింపు పూర్తిగా ఆటోమేటిక్ గా జరుగుతుందని తెలిపారు. మిల్లర్లు ధాన్యాన్ని స్వీకరించి ఓపియంఎస్ లో అక్నాలెడ్జ్మెంట్ ఇస్తారని, మిల్లర్ నిర్ధారణ అనంతరం ప్రభుత్వం రైతుల బ్యాంకు ఖాతాలలో నేరుగా నగదు జమ చేస్తుందని తెలిపారు. జిల్లాలోని రైతులు ప్రభుత్వ నాణ్యత ప్రమాణాలకు లోబడి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని తెలిపారు.

# బాల కేంద్రం ఉచిత వేసవి శిక్షణ గోడపత్రికను విడుదల చేసిన కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, ఏప్రిల్ 25 (ప్రభాత సమాచారం):** వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా బాల కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం నిర్వహించనున్న ఉచిత వేసవి శిక్షణ శిబిరం పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ నెల 27 నుండి మే 30 వరకు ప్రతిరోజు సాయంత్రం 4:30 నుండి 7:30 గంటల వరకు ఈ శిక్షణ తరగతులు జరుగుతాయని, కూచిపూడి, జానపద నృత్యం, చిత్రలేఖనం, సంగీతం (లలిత, కర్ణాటక, హిందూస్తానీ), వాయిద్య పరికరాలు (తబల, హార్మోనియం, పియానో), కుట్లు–అల్లికలు మరియు మెహందీ వంటి అంశాలపై శిక్షణా అందించడం జరుగుతుందన్నారు. 5 నుండి 16 సంవత్సరాల లోపు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. అనంతరం గత సంవత్సరం అక్టోబర్ 5వ




తేదీన చెన్నైలోని సివెట్ కళాశాల మైదానంలో వరల్డ్ కరాటే మాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ కరాటే విన్యాసాల్లో ఆదిలాబాద్ జిల్లాకు చెందిన మాస్టర్లు మిట్టు దత్తు, గాజుల జగన్నాథ్ రుషి పాల్గొని, 45 నిమిషాల పాటు నిరంతరాయంగా పంచ్‌లు కురిపించి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించినందుకు గాను గిన్నిస్ బుక్ మెమంటోను కలెక్టర్ వారికి అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్మీడియట్ అధికారి గణేష్ జాదవ్, బాల కేంద్రం ప్రతినిధులు మెట్టురవి పాల్గొన్నారు.





## ‘కేడీ’ ట్రైలర్ డిలీట్..

ఓ పాట వివాదాస్పదం కావడంతో ఇటీవల వార్తల్లో నిలిచిన కన్నడ సినిమా ‘కేడీ: ది డెవిల్’ . ఈ చిత్రానికి ఇప్పుడు మరో సమస్య ఎదురైంది. ఈ నెల 22న యూట్యూబ్‌లో విడుదలైన ఈ మూవీ ట్రైలర్  ప్రస్తుతం కనిపించడం లేదు. దీంతో, ఏం జరిగిందోనంటూ సినీ అభిమానులు నెట్టింట చర్చకు తెర లేపారు. దీనిపై నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ వివరణ ఇచ్చింది. “సర్టిఫికేషన్ ప్రోసెస్‌లో.. ధ్రువీకరించని కంటెంట్‌తో పొరపాటున ట్రైలర్ రిలీజ్ అయింది. వెంటనే దానిని గుర్తించి యూట్యూబ్ నుంచి డిలీట్ చేశాం. మార్గదర్శకాలను అనుసరించి త్వరలోనే రివైజ్డ్ వెర్షన్‌ను అప్‌లోడ్ చేస్తాం. ఈ పొరపాటుకు చింతిస్తున్నాం. సర్టిఫికేషన్‌కు సంబంధించి అన్ని నిబంధనలు పాటించడానికి మేం కట్టుబడి ఉన్నాం” అని పేర్కొంది.ధ్రువ్ సర్జా హీరోగా నటించిన సినిమా ఇది. ప్రేమ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో ఏప్రిల్ 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులోని ‘సర్కే నిన్నా సెరగా సర్కే’ అంటూ సాగే కన్నడ సాంగ్‌తోపాటు.. ఇతర భాషల్లో డబ్ చేసిన పాటనూ ఇటీవల విడుదల చేశారు. ప్రధానంగా హిందీ వెర్షన్‌పై తీవ్ర అభ్యంతరం వ్యక్తమైన సంగతి తెలిసిందే. బాలీవుడ్ స్టార్లు సంజయ్ దత్, నోరా ఫతేహి నటించిన ఈ పాటను అన్ని ప్లాట్‌ఫామ్స్ నుంచి తొలగించారు.



## జోరు పెంచుతున్న పూజ

పూజా హెగ్డే.. తెలుగు సినీప్రియుల బుట్టబొమ్మ. మూడేళ్ల క్రితం వరకు తెలుగులో స్టార్ నాయికగా జోరు చూపించిన ఈ సుందరి వరుస పరాజయాలతో కాస్త నెమ్మదించాల్సి వచ్చింది. ఈ మధ్యలో హిందీ, తమిళ భాషల్లో ఒకటి రెండు సినిమాలు చేసినా ఏదీ ఆశించిన ఫలితాన్ని అందివ్వలేదు. అయితే ఇప్పుడామె మూడేళ్ల విరామం తర్వాత తిరిగి తెలుగులోకి అడుగు పెట్టేందుకు సిద్ధమైంది. ప్రస్తుతం దుల్కర్ సల్మాన్‌కి జోడీగా రవి నెలకుడితి తెరకెక్కిస్తున్న రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌లో సందడి చేస్తోంది. శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటున్న ఈ సినిమా ఈ ఏడాది ద్వితీయార్ధంలోనే థియేటర్లలోకి రానుంది. ఇక మరోవైపు నాని - సుజిత్ సినిమాతో పాటు తెలుగులో మరో యువ హీరో చిత్ర విషయంలోనూ ఆమె పేరు బలంగా వినిపిస్తోంది. మరి ఇవి కార్యరూపంలోకి వస్తాయా.. ప్రచారానికే పరిమితమవుతాయా? అన్నది వేచి చూడాలి.

## ధనుష్, మమితా కర

‘నా మీద పడిన మచ్చని తుడిచేయాలి. నన్ను నమ్ముకున్నవాళ్లని ముందుకు తీసుకెళ్లాలి’ అంటూ తనవైన ప్రయత్నాల్ని మొదలుపెట్టాడు కరస్వామి. అందరూ కర అనే పిలిచే అతని ప్రయత్నాలు శుభకరంగా ముందుకు సాగాయో లేదో తెరపై చూసి తెలుసుకోవల్సిందే. ధనుష్ హీరోగా విఘ్నేశ్ రాజా దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం ‘కర’. మమితా బైజు కథానాయిక. డా.ఈషారి కె.గణేశ్ నిర్మించారు. ఈ చిత్రాన్ని ఈనెల 30న తెలుగు రాష్ట్రాల్లో సీహెచ్ సతీశ్ కుమార్, రాజేశ్ కుమార్ బొబ్బర విడుదల చేస్తున్నారు. శుక్రవారం టీజర్‌ని విడుదల చేశారు. ‘పంటో... గడ్డో... పాపమో... పుణ్యమో.. తను నాటింది తనే నరుక్కోవాలి...’ అంటూ మొదలయ్యే టీజర్ సినిమాపై ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఒకవైపు కుటుంబ బాధ్యతల్ని మోస్తూ, మరోవైపు తనకి ఎదురైన సమస్యని ఎదుర్కొనే యువకుడిగా ధనుష్ తెరపై కనిపించనున్నట్టు టీజర్ చాటుతోంది.











# అమ్మనై పాలన అందిస్తా

- కేసీఆర్ ఆత్మలేని మరబొమ్మ..
- ఆయన తోడేళ్ల చేతిలో బందీ అయ్యాడు
- మునీరాబాద్ వేదికగా టీఆర్ఎస్ పార్టీని ప్రకటించిన కవిత
- పసుపు, నీలం, ఆకుపచ్చ రంగుల్లో పార్టీ జెండా
- ఉచిత విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి, సామాజిక న్యాయం ఇరుసుగా పార్టీ పని చేస్తుంది
- తెలంగాణకు అన్యాయం జరుగుతున్న బీజేపీ బానిస ఎంపీలు మాట్లాడ్తలేరు
- ప్రాణం పెట్టి పనిచేసే పార్టీ కావాలి
- అందుకే తెలంగాణ రాష్ట్ర సేన పార్టీతో మీ ముందుకు వస్తున్నాం
- తెలంగాణ రాష్ట్ర సేన అధి నాయకురాలు కల్వకుంట్ల కవిత

## కర్కోటక ప్రభుత్వాన్ని తరిమేసేందుకు పాంచజన్యం పూరిస్తున్న

ప్రభాత సమాచారం, హైదరాబాద్

అమ్మనై తెలంగాణ ప్రజలకు పరిపాలన అందిస్తానని కల్వకుంట్ల కవిత ప్రకటించారు. మేడ్చల్ జిల్లా మునీరాబాద్ లోని ప్రొఫెసర్ జయశంకర్ ప్రాంగణం (అద్వయ కన్వెన్షన్)లో శనివారం ఉదయం తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్) పార్టీని ప్రకటించారు. కర్కోటక, రాక్షస రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని తరిమేసేందుకు టీఆర్ఎస్ పాంచజన్యాన్ని పూరిస్తున్నానని అన్నారు. భారీ సంఖ్యలో తరలివచ్చిన అభిమానుల కోలాహలం మధ్య పార్టీ పేరును ప్రకటించారు. తన కోసం తరలివచ్చిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. ఉచిత విద్య, ఉచిత వైద్యం, వ్యవసాయం, ఉపాధి, సామాజిక న్యాయం అనే పంచ సూత్రాలే ఇరుసుగా తమ పార్టీ పని చేస్తుందన్నారు. రాష్ట్రంలో ఇప్పుడు ప్రధాన ప్రతిపక్షంగా ఈ ఐదు రంగాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమిస్తామని.. రెండున్నరేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చి ఆయా సమస్యలకు పరిష్కారం చూపిస్తానని తెలిపారు. ఉద్యమకాలంలో ప్రజల కోసం పరితపించిన కేసీఆర్ ఇప్పుడు గుంటనక్కలు, తోడేళ్ల చేతిలో బందీ అయ్యారని.. ఆయన మన కేసీఆర్ కాదు మరబొమ్మ అన్నారు. తెలంగాణాకు ఏదైనా జరిగితే ప్రాణం పెట్టి పని చేసే పార్టీ కావాలని అందుకోసమే తాను టీఆర్ఎస్ పార్టీని ఏర్పాటు చేస్తున్నానని తెలిపారు.

**రేవంత్ రెడ్డి కర్కోటకుడు.. నియంత**

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి...కర్కోటక, నియంత సీఎం అని కవిత మండిపడ్డారు. వెలుగుమట్లలో అన్ని పర్మిషన్లు ఉన్న సరే అక్కడి ప్రజల ఇళ్లను కూల్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ బాధతో ఒక గర్భిణీకి అబార్షన్ అయితే ఆమె తండ్రి రోదన కళ్ల ముందు ఇంకా మెదులుతోందని చెప్పారు. రెండు నెలల చిన్నారిని కాళ్లతో తన్ని చంపితే ఇప్పటికీ కూడా కేసు పెట్టలేదన్నారు. గురుకులాల్లో విషం పెట్టి విద్యార్థులను చంపుతుంటే ఈ ప్రభుత్వం స్పందించటం లేదని విమర్శించారు. కర్ల రాజేష్ అనే యువకుడిని లాకప్ డెత్ చేస్తే ఇప్పటికీ కూడా చర్యలు తీసుకోలేదన్నారు. అందుకే ఈ ముఖ్యమంత్రిని కర్కోటక, నియంత ముఖ్యమంత్రి అంటున్నానని చెప్పారు. రాష్ట్రంలో ఇప్పుడున్న మూడు పార్టీలు కుటుంబ పాలన, అవినీతి, బంధుప్రీతితో నిండిపోయాయని చెప్పారు. రాహుల్ గాంధీని ప్రధాని చేయడం కాంగ్రెస్ అజెండా అయితే పెద్ద సార్ ఫామ్ హౌస్ లో ఉండి...చిన్న సార్ ను సీఎం చేయాలన్నది బీఆర్ఎస్ అజెండా అని చెప్పారు. ఇక సామాజిక న్యాయాన్ని ఖతం పట్టించడమే బీజేపీ సింగిల్ అజెండా అని కవిత అన్నారు. ఈ మూడు పార్టీల మీద అలుపెరగని పోరాటం చేసేందుకు తెలంగాణ రాష్ట్ర సేన సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

**అమ్మగా పరిపాలన అందిస్తా**

తెలంగాణలో 3.50 కోట్ల మంది ప్రజలకు అమ్మనై పరిపాలన అందిస్తానని కవిత చెప్పారు. అమ్మతనంతో పాలన చేస్తేనే బిడ్డల కష్టం తెలుస్తుందన్నారు. తెలంగాణలో ఏళ్ల తరబడి నడిచిన భూస్వామ్య వ్యవస్థపై ఎందరో మహానుభవులు పోరాడితేనే సమానత్వం వచ్చిందన్నారు. మలి దశలో కేసీఆర్, ఉద్యమకారులు పోరాడితే కొత్త రాష్ట్రం వచ్చిందన్నారు. ఇప్పుడు తాము రాజకీయ శక్తితో పాటు ప్రజా పోరాటాలను మిళితం చేసి సామాజిక తెలంగాణ సాధిస్తామని చెప్పారు. తల్లి జేబు చూడదని, కడుపు చూస్తుందని కవిత చెప్పారు. కచ్చితంగా రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా తామే ఉంటామని... మరో రెండేళ్లలో అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు.





### పాంచజన్యం పేరుతో ఐదు హామీలు

తెలంగాణ రాష్ట్ర సేన అజెండాను కవిత వివరించారు. పాంచజన్యం పేరుతో ఐదు అంశాలపై హామీ ఇచ్చారు. ముఖ్యంగా ఉచిత విద్య, ఉచిత వైద్యం, రైతు సంక్షేమం, ఉపాధి, సామాజిక న్యాయం అనే అంశాలపై దృష్టి పెడతామని ప్రకటించారు. కేజీ నుంచి పీజీ వరకు ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో చదివిన కూడా ప్రజలపై రూపాయి భారం పడనివ్వమని చెప్పారు. ఎంత పెద్ద ఆరోగ్య సమస్యకైనా కార్పొరేట్ వైద్యం చేయించుకున్న సరే ప్రజలకు ఆ వైద్యాన్ని ఉచితంగానే అందించే బాధ్యత తనదని కవిత స్పష్టం చేశారు. ఇక రైతు సంక్షేమం అంటే రైతుకు గౌరవం వచ్చేలా కృషి చేయటమేనన్నారు. తాము రైతులమని గర్వంగా చెప్పుకునేలా చేస్తామన్నారు. 24 గంటల ఉచిత కరెంట్, యూరియ సహా రైతు సంక్షేమానికి చేయాల్సినవన్నీ చేస్తామని స్పష్టం చేశారు. రైతును రాజు చేయటమే లక్ష్యమన్నారు. ఇక ఉపాధి విషయంలోనూ తమకు స్పష్టమైన విజన్ ఉందని కవిత చెప్పారు. యువతకు ఉపాధి అంటే కేవలం ఉద్యోగం మాత్రమే కాదన్నారు. వారి వద్ద మంచి వ్యాపార ఆలోచన ఉంటే 2 లక్షల నుంచి 20 కోట్ల వరకు ప్రభుత్వమే రుణం అందించి వారిని ప్రోత్సహిస్తుందని స్పష్టం చేశారు. అదే విధంగా తాము అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే ఒకటే నోటిఫికేషన్ లో 4 లక్షల ఉద్యోగాలు ఇస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమకారులు తమ యవ్వనాన్ని ఉద్యమంలో కోల్పోయారని చెప్పారు. వారి కోసం జూన్ 2, 2014 ను కటాఫ్ తేదీగా నిర్ణయిస్తూ లక్ష సూపర్ న్యూమరీ ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఇక సామాజిక న్యాయం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తామన్నారు. హిందీలో తియ్యగా మాట్లాడి బీఆర్ఎస్, కాంగ్రెస్ లు మైనార్టీలను మోసం చేశాయని కవిత చెప్పారు. మైనార్టీలతో పాటు అన్ని వర్గాలకు రాజకీయ అధికారం కోసం తమ పార్టీ పోరాటం చేస్తుందన్నారు. మహిళ భద్రతకు ప్రాధాన్యం ఇవ్వటంతో పాటు చిరు ఉద్యోగులు, వ్యాపారులు, కాంట్రాక్టర్లను కడుపులో పెట్టుకొని చూసుకుంటామన్నారు.

# ఆర్టీసీ సమ్మె విరమణతో సంబరాలు

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 25 (ప్రభాత సమాచారం):** తెలంగాణ రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికుల సమ్మె విరమణ నేపథ్యంలో ఆసిఫాబాద్ జిల్లాలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క శనివారం ఆసిఫాబాద్ బస్టాండ్‌ను సందర్శించి కార్మికులతో కలిసి సంబరాల్లో పాల్గొన్నారు. కార్మికులకు శుభాకాంక్షలు తెలిపిన ఆమె, ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూ కార్మికుల సమస్యలను సానుకూలంగా పరిష్కరించడం అభినందనీయమని పేర్కొన్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో జరిగిన చర్చల



ఫలితంగా సమస్య పరిష్కారం సాధ్యమైందని తెలిపారు. కార్మికులకు 11 శాతం పీఆర్సీ మంజూరు చేయడం, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే అంశంపై కమిటీ ఏర్పాటు, గుర్తింపు సంఘాల ఎన్నికలకు అంగీకారం వంటి నిర్ణయాలు చారిత్రాత్మకమన్నారు. అనంతరం గ్రంథాలయ చైర్మన్ అనిల్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఇరుకుల మంగ, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు తదితరులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నర్సంపేటకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతికి నివాళులర్పించి, ఆయన కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేశారు. కార్మికులు సంతోషంగా విధుల్లో చేరడం సంతోషకరమని, ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా బస్సులు యథావిధిగా నడపాలని కోరారు.



## వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

### ఐటీడీఏ డిడి జాదవ్ అంబాజీ

**ఉట్నూర్, ఏప్రిల్ 25 (ప్రభాత సమాచారం):** గిరిజన విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీసి వారిని సాన పెట్టేందుకు గిరిజన సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ అన్నారు. శనివారం ఉట్నూర్ కేబి కాంప్లెక్స్ లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వేసవి సెలవులలో తమ సమయాన్ని వృథా చేసుకోకుండా క్రీడలు కలలు కంప్యూటర్ కుట్లు అల్లికలు టైలరింగ్ చిత్రలేఖనం లాంటి ఎన్నో అంశాలను నేర్చుకునే అవకాశం విద్యార్థులకు దక్కిందన్నారు, భవిష్యత్తులో ఉపాధికి సైతం ఎన్నో అవకాశాలు లభిస్తాయని చెప్పారు, పిల్లలు ఇంటిని మరిచేలా అనేక కార్యక్రమాలు ఉంటాయని ఆటపాటలతో సేద తీరాలని కోరారు. డిప్యూటీ డిఈఓ గోడం చందన్, ఏపీఓ పీవీటీజీ ఆత్రం భాస్కర్ లు మాట్లాడుతూ... 15 రోజులపాటు జరిగే శిబిరాలలో చివరి వరకు ఉండి అన్ని అంశాల్లో ప్రావీణ్యం సాధించాలన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున బయట తిరగొద్దని సూచించారు. పాఠశాలలకు వచ్చినప్పుడు శిబిరాల్లో నేర్చుకున్న విషయాలను గురించి అడుగుతామని చెప్పారు, అనంతరం క్రీడా పరికరాలను పంపిణీ చేశారు.

## బాల్య వివాహాలను ప్రోత్సహించడం నేరం

### లక్షెట్టిపేట జూనియర్ సివిల్‌జడ్జి సాయికిరణ్

**లక్షెట్టిపేట, ఏప్రిల్ 25 (ప్రభాత సమాచారం):** బాల్యవివాహాలను ప్రోత్సహిం చడం చాలా పెద్ద నేరం అని లక్షెట్టిపేట జూనియర్ సివిల్ జడ్జి కాసమళ్ల సాయికిరణ్ అన్నారు. లక్షెట్టిపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అమ్మాయికి 18ఏండ్లు అబ్బాయికి 21సంవత్స రాలు పూర్తి అయిన తర్వాతనే వివాహం చేయాలన్నారు. అంతకంటే తక్కువ వయస్సు ఉన్నవాళ్లకు వివాహాలుచేస్తే చట్టరిత్యా శిక్షార్హుల వుతార న్నారు. చిన్నతనంలో పెండ్లి చేయడంతో ఇద్దరి ఆరోగ్యాలు దెబ్బ తింటా యన్నారు. తెలిసీతెలియని వయస్సు కనుక గొడవలు జరిగే అవకాశం కూడా ఉంటుందన్నారు. తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురి అవుతారన్నారు. చిన్నతనంలో ఆడపిల్లలు గర్భం దాల్చితే తీవ్రమైన అనారోగ్యాల పాలయ్యే అవకాశం ఉందన్నారు. అనంతరం పలుచట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దొంత అంజలినర్సయ్య, వైస్‌చైర్మన్ రాజేశ్వరి, మున్సిపల్‌కమిషనర్ విజయ్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్య క్షుడు గోవింద్‌రావు పాల్గొన్నారు.



## బాధితులకు న్యాయం జరిగేలా చూడాలి

**ఉట్నూర్, ఏప్రిల్ 25 (ప్రభాత సమాచారం):** ఉట్నూర్ సబ్-కలెక్టర్ పర్యవేక్షణలో పనిచేస్తున్న ఉట్నూరులోని ఏజెన్సీ కోర్టు, 100 సివిల్ ప్రొసీజర్ కోడ్ కేసులను విచారణకు స్వీకరించింది. సబ్-కలెక్టర్ ఈ కేసులను సమీక్షించి, సంబంధిత పక్షాలకు న్యాయం జరిగేలా చూడటానికి సకాలంలో పరిష్కరించడం ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. ప్రక్రియను వేగవంతం చేయడానికి మరియు విచారణలలో పారదర్శకతను పాటించడానికి సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో సమర్థవంతమైన కేసుల నిర్వహణకు మరియు ఫిర్యాదుల వేగవంతమైన పరిష్కారానికి పరిపాలన యంత్రాంగం యొక్క నిబద్ధతను పాటించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచనలు చేశారు.



## కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం



**మంచిర్యాల, ఏప్రిల్ 25 (ప్రభాత సమాచారం):** గత స్ట్రక్చర్డ్ సమావేశంలో తమ పరిధిలో పరిష్కరించ దగిన వాటిని దాదాపుగా పూర్తి చేశామని, కార్పోరేట్ పరిధిలో ఉన్న అంశాలను, ఇతరత్ర అనుమతులతో చేపట్టాల్సిన పనులు త్వరలోనే పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామని జీఎం మునిగంటి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. శనివారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో గుర్తింపు సంఘం ప్రతినిధులతో నిర్వహించిన స్ట్రక్చర్ కమిటీ సమావేశంలో మార్చి నెల స్ట్రక్చర్ కమిటీలో యాజమాన్యం దృష్టికి తెచ్చిన సమస్యల పై చర్చించి, గత సమావేశంలో లెవనెత్తిన అంశాల పరిష్కారానికి చేపట్టిన చర్యలు, పరిష్కరించి సమస్యల వివరాలు గుర్తింపు సంఘం ప్రతినిధులకు అందజేశారు. అనంతరం ఏప్రిల్ నెల స్ట్రక్చర్ కమిటీ సమావేశంలో ఏరియా పరిధిలోని వివిధ గనుల్లో ఉద్యోగుల సౌకర్యార్థం చేపట్టాల్సిన కార్యక్రమాలను జీఎం దృష్టికి గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ప్రతినిధులు తీసుకువచ్చారు. అన్ని గనులు, పని ప్రదేశాలలో రక్షణతో కూడిన ఉత్పత్తి సాధన లక్ష్యంగా అవసరమైన పనిముట్లు, యంత్రాల సమీకరణ వివరాలతో పాటు ఉద్యోగుల సౌకర్యార్థం గనుల పరిధిలో ఏర్పాటు చేయాల్సిన అంశాలను జీఎం దృష్టికి తీసువచ్చారు. ఉద్యోగుల పదోన్నతులు, హెచ్చీఎల్‌ఆర్‌ఎస్ స్కీం వడ్డీ చెల్లింపులో జాప్యం లేకుండా జరిగేలా చూడాలని కోరారు. వీటితో పాటు సంక్షేమానికి సంబందించి ఉద్యోగుల నివాసముండే కాలనీలు, క్వార్టర్లలో చేపట్టాల్సిన మౌళిక సదుపాయాలతో పాటు డిస్పెన్సరీలలో కల్పించాల్సిన వసతుల వివరాలు అందించారు. గుర్తింపు సంఘం ప్రతినిధులు సమస్యలన్నింటినీ త్వరలోనే పరిష్కరిస్తామని శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ హామి ఇచ్చారు. ఉద్యోగుల సంక్షేమం సౌకర్యార్థం అన్ని రకాల ఏర్పాట్లు చేపట్టేందుకు సంస్థ సిద్దంగా ఉందని, ఉద్యోగులు, కార్మిక సంఘాలు నాణ్యమైన ఉత్పత్తి ద్వారా సంస్థ దీర్ఘకాల మనుగడకు కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం శ్రీరాంపూర్ బ్రాంచీ సెక్రటరీ బాజీ సైదా, ఎస్ఓ టూ జీఎం చీ . సత్యనారాయణ, డీజీఎం(ఐఈడీ) రాజన్న, డీజీఎం(పర్సనల్) ఎస్. అనిల్ కుమార్ , డీజీఎం(సివిల్) కే. ఆనంద్ కుమార్, ఏరియా ఇంజనీర్ టీ. రమణ రావు, సీనియర్ పీఓ ప్రశాంత్ , అన్ని గనుల ఏజెంట్లు, విభాగాధిపతులు , అధికారులు, గుర్తింపు సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పూలే దంపతులు మార్గదర్శకులు



**వాంకిడి, ఏప్రిల్ 25 (ప్రభాత సమాచారం):** మండలంలోని నార్లాపూర్ గ్రామంలో మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలను ఎమ్మెల్యే కోవ లక్ష్మి శనివారం ఆవిష్కరించారు. జెండా ఆవిష్కరణ, జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించిన ఎమ్మెల్యే అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించి పూలే దంపతుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పూలే దంపతులు సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతికి చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.



### కేంద్రం తీసుకొస్తున్న నాలుగు

## లేబర్ కోడ్లను రద్దు చేయాలి

**మంచిర్యాల, ఏప్రిల్ 25 (ప్రభాత సమాచారం):** కేంద్రం తీసుకొస్తున్న నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని హమాలి సంఘం గౌరవ అధ్యక్షులు గుమాస ప్రకాష్ కోరారు. శని వారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని హరిత ఫంక్షన్ హాల్ లో జరుగుతున్న మంచిర్యాల జిల్లా రైస్ మిల్ హమాలి యూనియన్ మహాసభలో ఉద్యోగ సంఘాల జిల్లా సమన్వయకర్త రంగు రాజేశంతో కలిసి ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నాయని, కేంద్ర ప్రభుత్వం కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి కార్మికులను బానిసలుగా మార్చి నాలుగు లేబర్ కోడ్ లను తీసుకువచ్చి అమలు చేసేందుకు పూనుకుందన్నారు. ఈ కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ రద్దు చేస్తూ హమాలీలకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు అమలు చేయాలని, 50 సంవత్సరాల పైబడిన హమాలీలకు నెలకు రూ. 9 వేల పెన్షన్ ఇవ్వాలని, అసంఘటిత కార్మికులందరికీ సామాజిక భద్రత చట్టం తీసుకురావాలన్నారు. జిల్లాలో పనిచేస్తున్న రా రైస్ మిల్లు, బాయిల్డ్ రైస్ మిల్లు, రవ్వ మిల్లు, బ్రేడ్ కంపెనీ, గోడౌన్స్, బేవరేజ్, మార్కెట్ యార్డ్, గ్రామీణ హమాలీలు తదితర రంగాల్లో ఎగుమతి, దిగుమతులు చేస్తూ తమ రక్తాన్ని చెమటగా మార్చి సరుకుల ఉత్పత్తిలో కీలక భూమిక పోషిస్తు, ఇంత చాకిరి చేస్తున్న హమాలీలకు ప్రమాద బీమా, ఆరోగ్య బీమా, పెన్షన్, పిఎఫ్, ఈఎస్ఐ బోనస్ వంటి చట్టబద్ధ హక్కులు అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయని విమర్శించారు. ఇప్పటికైనా నమాలీలకు ప్రభుత్వమే గుర్తింపు కార్డులు ఇవ్వడంతోపాటు పిఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్, ప్రమాద బీమా తదితర సంక్షేమ పథకాలు అమలు చేయాలని, హమాలీలు ఇల్లు కట్టుకోవడం కోసం కేంద్ర ప్రభుత్వం రూ. 10 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించాలని, పనిచేస్తూ ప్రమాదంలో మరణించిన హమాలీలకు రూ. 25 లక్షలు ప్రభుత్వమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలో సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ మందమర్రి బ్రాంచ్ అధ్యక్షులు వెంకటస్వామి, సిఐటియూ జిల్లా కమిటీ సభ్యులు చల్లూరి దేవదాస్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాజ్ కుమార్, మహేష్, జిల్లా కన్వీనర్ శ్రీకాంత్, రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి పాయిరాల రాములు తదితరులు పాల్గొన్నారు.



## ఆర్టీసీ కార్మికుల సంబరాలు

**నిర్మల్, ఏప్రిల్ 25 (ప్రభాత సమాచారం):** ఆర్టీసీ కార్మికుల ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించిన నేపథ్యంలో సమ్మె వీరమాణానికి కృషిచేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర మంత్రులు పట్టి విక్రమార్క పున్నం ప్రభాకర్ చిత్రపటాలకు అభిషేకం నిర్వహించి సంబరాలు జరుపుకున్నారు. స్థానిక బస్ డిపో వద్ద ఆర్టీసీ కార్మికులు జేఏసీ నాయకులు ముఖ్యమంత్రి తమ డిమాండ్లను పరిష్కరించేందుకు మంత్రుల ఉపసంఘాన్ని ఏర్పాటు చేసి సమస్య పరిష్కారానికి చొరవ చూపడం జరిగిందని దాన్ని వెంటనే అమలు చేయాలని వారు నినాదాలు చేశారు ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఆర్టిసి కార్మికులు ఉన్నారు.

## ఆర్టీసీ సిబ్బందికి మజ్జిగ పంపిణీ



**నిర్మల్, ఏప్రిల్ 25 (ప్రభాత సమాచారం):** ఎండ తీవ్ర రూపమ్ దాల్చుచున్నందున ఎండలో డ్యూటీ చేసే ఆర్టీసీ ఉద్యోగులకు నిర్మల్ ఆర్టీసీ డిపోలో మజ్జిగ పంపిణి చేస్తున్నట్లు డిపోమేనేజర్ కే పండరి తెలిపారు. డ్యూటీ చేయు కండక్టర్ డ్రైవర్లు తలకు టవెల్ ధరించాలని ఆయన సూచించారు. డ్యూటీ చేస్తున్న ప్రతి ఒక్క ఉద్యోగి మజ్జిగా పాకెట్ వెంట తీసుకెళ్లాలని ఈ పంపిణి వేసవి కాలం వెళ్లిపోయే వరకు ఉంటుందని తెలిపారు.

## దేవరకోట ఆలయంలో పల్లకి సేవ



**నిర్మల్, ఏప్రిల్ 25 (ప్రభాత సమాచారం):** నిర్మల్ పట్టణంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవరకోట ఆలయంలో శనివారం పల్లకి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను పల్లకి సేవలో మూసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అంతకుముందు ఆన్లైన్లో పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ ఆమేడ శ్రీనివాస్, ధర్మకర్తలు కోటగిరి శ్రీధర్ గోపి తదితరులు ఉన్నారు

## కన్యకా పరమేశ్వరి జన్మదిన వేడుకలు

**నిర్మల్, ఏప్రిల్ 25 (ప్రభాత సమాచారం):** జిల్లా కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆదరణ వాసవి కన్యకా పరమేశ్వరి జన్మదిన వేడుకలను ఆదివారం నిర్వహిస్తున్నట్లు నిర్వాణ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిల, మున్సిపల్ చైర్ పర్సన్ అప్పల కావ్య గణి చక్రవర్తి, మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, టిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జి శ్రీ రావుకు ఆహ్వాన పత్రాలను కలిసి అందజేశారు, కన్యకా పరమేశ్వరి జన్మదిన వేడుకలు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు ఆవిడ దేవేందర్ శ్రీనివాస్ తదితరులు తెలిపారు.

# గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే కోవ లక్ష్మి



## రూ.3 కోట్లతో రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 25 (ప్రభాత సమాచారం):** ఆసిఫాబాద్ మండలం పాత రౌట సంకపల్లి, పర్శ నంబాల గ్రామాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు కీలక అడుగు పడింది. కేంద్ర ప్రభుత్వ పిఎం జన్ మన పథకం ద్వారా మంజూరైన రూ.3 కోట్ల నిధులతో చేపట్టనున్న రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కోవ లక్ష్మి శనివారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే పాత రౌట సంకపల్లి, పర్శ నంబాల గ్రామాల ప్రజల ఎన్నో ఏళ్లుగా ఉన్న రవాణా సమస్యలు తీరుతాయని, గ్రామాల మధ్య రాకపోకలు మరింత సులభతరం అవుతాయని పేర్కొన్నారు. విద్య, వైద్యం, ఉపాధి వంటి కీలక సేవలకు సులభంగా చేరుకునే అవకాశం ఏర్పడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవ్, కిష్టయ్య,ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరు ఉపాధి హామీ పనిలో చేరండి

**బోథ్, ఏప్రిల్ 25 (ప్రభాత సమాచారం):** జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరు ఉపాధి హామీ పనిలో చేరాలని ఎంపీడీవో రమేష్, ఏపీవో జగ్గిరావును కోరారు. శనివారం మండలంలోని కనుగుట్ట, కౌట (బిశ్రీ సాంగ్వి గ్రామాలలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు కూలీలతో వారికున్న సందేహాలను నివృత్తి చేశారు ప్రతి ఒక్కరు ఉపాధి హామీ పనిని పూర్తి చేసుకున్నట్లయితే సకాలంలోనే అందుకు సంబంధించిన కూలి డబ్బులు వస్తాయి అని పేర్కొన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయం పూట పనికి రావాలని సూచించారు. కొలతల ప్రకారం డబ్బులు వస్తాయని విషయంలో ఎలాంటి అనుమానాలు లేవన్నారు.



వారి వెంట ఆయా గ్రామాల సర్పంచులు స్వామి ,లలిత, ఈసీ మధుకర్ .పీఏ నరేష్ .ఎస్ఏ రాంసింగులు ఉన్నారు.

## ఆదిలాబాద్ జిల్లాలో
# భారీ సైబర్ మోసం బట్టబయలు

**ఆదిలాబాద్, ఏప్రిల్ 25 (ప్రభాత సమాచారం):**



ఆదిలాబాద్ జిల్లాలో పోలీసులు చేపట్టిన ఆపరేషన్ క్రాక్డౌన్-1.0లో భారీ సైబర్ మోసాలు వెలుగులోకి వచ్చాయి. జిల్లా వ్యాప్తంగా 74 అనుమానాస్పద మ్యూల్ అకౌంట్లను గుర్తించి,12 ప్రధాన కేసులు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఈ మోసాల ద్వారా మొత్తం రూ.7,01,83,214 అక్రమ లావాదేవీలు జరిగినట్లు వెల్లడించారు. గేమింగ్ యాప్స్, ఆన్లైన్ బెట్టింగ్, ఫేక్ ట్రేడింగ్, టాస్క్/రివ్యూ మోసాల ద్వారా డబ్బు మార్పిడి జరిగినట్లు విచారణలో బయటపడింది. ఈ కేసుల్లో షెర్లా రాజవర్ధన్, పేట్లశ్రీ అక్షయ్, రాజేందర్, షేక్ సమీర్లను రిమాండ్కు పంపగా, మరికొంత మందిని నిందితులుగా గుర్తించారు. దేశవ్యాప్తంగా నమోదైన చీజన్రా ఫిర్యాదులతో ఈ అకౌంట్లు అనుసంధానమై ఉన్నట్లు పోలీసులు తెలిపారు.ప్రజలు తమ బ్యాంకు ఖాతాలు, ాువీ కార్డులు, న్యూ, ా×చీ వివరాలు ఇతరులకు ఇవ్వవద్దని హెచ్చరించారు. బ్యాంక్ ఖాతాలను స్నేహితులు,బంధువులకు ఇచ్చినా చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్లైన్ లేదా సమీప పోలీస్ స్టేషన్ను సంప్రదించాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి, సైబర్ క్రైమ్ ఎస్ఐ గోపికృష్ణ, సిబ్బంది రియాజ్, మజీద్, త్రిశూల్ తదితరులు పాల్గొన్నారు.

## జీఓ ప్రకారం జర్నలిస్టులకు అక్రిడిటేషన్ జారీ

### కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరిత



**ఆసిఫాబాద్, ఏప్రిల్ 25 (ప్రభాత సమాచారం):** జిల్లాలో 252 జీఓ ప్రకారం అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు అందజేస్తామని కలెక్టర్ హరిత అన్నారు. శనివారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటి సమావేశానికి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2026 సవత్సరము నకు గాను కమిటి ఆద్వర్యంలో మొదటి విడతలో 94 నూతన అక్రిడిటేషన్ కార్డులు మంజూరి చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. అక్రిడిటేషన్ కార్డుల జారి నిరంతర ప్రక్రియ అని తెలిపారు. అక్రిడిటేషన్ కార్డు కొరకు ధరఖాస్తు చేసుకున్నవారు 252 జి ఓ లో పేర్కొన్న అవసరమైన దృవ పత్రాలను సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్ఓ, జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులు అబ్దుల్ రహమాన్, రవి నాయక్, తుకారాం, సంతోష్, ప్రకాష్ గౌడ్, చందు, ఆబిద్ అహ్మద్, వినయ్ కుమార్, రాజు, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.



## నిర్మల్ జిల్లా నూతన కలెక్టర్‌గా భవేష్ మిశ్రా

### ఇంటర్‌త బోర్డు డైరెక్టర్‌గా అభిలాష అభినవ్ బదిలీ

**నిర్మల్, ఏప్రిల్ 25 (ప్రభాత సమాచారం):** నిర్మల్ జిల్లా నూతన కలెక్టర్‌గా భవేష్ మిశ్రా నియమితులయ్యారు. గతంలో కలెక్టర్‌గా పనిచేసిన అభిలాష అభినవ్ ఇంటర్మీడియట్ బోర్డు సెక్రటరీగా బదిలీ అయ్యారు. 2015 బ్యాచ్‌కు చెందిన భవేష్ మిశ్రా ప్రస్తుతం పరిశ్రమలు ఐటీ, ఈడసీ విభాగంలో స్పెషల్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్నారు. జూన్ 16, 2024న బాధ్యతలు చేపట్టిన అభిలాష అభినవ్, నిర్మల్‌లో సంవత్సరం తొమ్మిది నెలలు కలెక్టర్‌గా పనిచేశారు. ఆమె ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల కోసం 'బాలశక్తి' అనే వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు.

## ఉత్తమ అవార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలి

**నిర్మల్, ఏప్రిల్ 25 (ప్రభాత సమాచారం):** మే 1న ప్రపంచ కార్మికుల దినోత్సవం పురస్కరించుకొని ఉత్తమ యాజమాన్యాలకు, కార్మికులకు అవార్డులు అందించడం జరుగుతుందని కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ ముత్యంరెడ్డి తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో పరిశ్రమలు నడుపుతున్న యజమానులు అందులో పని చేస్తున్న కార్మికులకు ఉత్తమ వారిని ఎంపిక చేసి ఈ అవార్డులను అందించడం జరుగుతుందని తెలిపారు. ఈనెల 27 లోపు ఉత్తమ అవార్డుల కోసం ఆరు లేని వారు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఇతర వివరాలకు 949 255 235, 2 3 4, 2 3 2 నంబర్లను సంప్రదించాలని ఇతర వివరాలకు కార్యాలయంలో సిబ్బందిని సంప్రదించాలన్నారు.

